

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 12-07-2026 | సంపుటి - 29 | సంచిక - 50 | రూ : 4 | పేజీలు: 8


## నదిలో నీళ్లను నేరుగా ఎత్తిపోయగలిగితే

# బ్యారేజీలు ఎందుకు నిర్మించారు?

- తెలంగాణ వాదుల ముసుగులో కాళేశ్వరంపై భారాస వాదన వినిపిస్తున్న విశ్రాంత ఇంజనీర్లు
- గతంలో జరిగిన దోపిడీలు, అక్రమాల్లో వారికీ సంబంధం ఉంది
- ప్రాజెక్టు బాధ్యతను కిలాడీ కమిటీకి అప్పగించం
- ఈ కమిటీకి ఛైర్మన్ కేసీఆర్.. సభ్యుడు హరీశ్‌రావు
- ఇప్పుడు ఇందులో ఈటల కూడా చేరి భారాస పల్లవి అందుకున్నారు
- సీఎం రేవంత్‌రెడ్డి ఘాటు విమర్శలు

2లో





## సెమీ కండక్టర్ హబ్‌గా

# తెలంగాణ: శ్రీధర్‌బాబు

- టీ వర్క్స్‌లో సీఎంపీ కేంద్రం ప్రారంభం

రాయదుర్గం: సెమీ కండక్టర్ హబ్‌గా నగరాన్ని తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ చొరవతో చిప్‌ల తయారీలో కీలకమైన కెమికల్ మెకానికల్ పాలిషింగ్ (సీఎంపీ) ప్యాడ్ టెక్నాలజీ కేంద్రాన్ని శనివారం ఆయన రాయదుర్గం టీ వర్క్స్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ''సెమీ కండక్టర్ల తయారీలో రాష్ట్రం మరో కీలక మైలురాయిని చేరుకుంది. జపాన్‌కు చెందిన టోహో కోకి సీసాకుషో కంపెనీ సహకారంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. సెమీ కండక్టర్ చిప్ తయారీలో ఉపయోగించే సీఎంపీ ప్యాడ్‌లను ప్రస్తుతం విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటున్నాం. ఇకపై విద్యాసంస్థలు, పరిశ్రమల భాగస్వామ్యంతో రానున్న 24 నెలల్లో దేశీయంగా తయారు చేయిస్తాం'' అని వెల్లడించారు. టోహో కోకి సీసాకుషో సంస్థ ప్రతినిధి టకుయా నిషిమురా, బెంగళూరు జెట్రో సంస్థ డైరెక్టర్ జనరల్ స్వస్తిక్ కులకర్ణి, ఇండో బాక్స్ వ్యవస్థాపకుడు, సీఈవో డైసుకే సాంజి, జపాన్ ఇండియా బిజినెస్ బ్యూరో ఛైర్మన్ షిగెమారో యాసుయి, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, టీ వర్క్స్ సీఈవో జోగిందర్ తనికెళ్ల తదితరులు పాల్గొన్నారు.

## కన్నెపల్లి నుంచే రోజూ

# 2 టీఎంసీలు ఎత్తిపోయొచ్చు

- ఏపీలో పట్టిసీమ వద్ద నీటిని వాడుకుంటుంటే తెలంగాణలో ఎందుకు వాడరు?
- ఇది సీఎం తెచ్చిన కరవు: కేటీఆర్




హైదరాబాద్: మేడిగడ్డతో సంబంధం లేకుండా కన్నెపల్లి పంపుహౌస్ నుంచి రోజూ రెండు టీఎంసీల నీటిని ఎత్తిపోయవచ్చని భారాస రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. ఆ నీటితో గోదావరి బేసిన్‌లోని ఎస్సారెస్పీ, లోయర్, మిడ్ మానేరు, మల్లన్నసాగర్, బస్వాపూర్ జలాశయాలను నింపి సాగునీటి ఇబ్బందులను తీర్చవచ్చన్నారు. ఈ విషయాన్ని రిటైర్డ్ ఇంజినీర్ల అసోసియేషన్ కూడా స్పష్టం చేసిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్నది కాలం తెచ్చిన కరవు కాదని, భారాసపై కక్షతో రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ... ప్రజలపై రుద్దుతున్న కరవని మండిపడ్డారు. శనివారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో పార్టీ ముఖ్యనేతలతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ''కన్నెపల్లి పంపుహౌస్ వద్ద **తరువాయి 2లో**

## విహారంలో విషాదం.. వియత్నాంలో

2లో

# బ్రాహ్మణికి మరో అరుదైన గౌరవం

## అర్ధాంగి విజయంపై గర్వంగా ఉందన్న లోకేశ్




- ఫార్చ్యూన్ ఇండియా '100 మంది ప్రభావశీల మహిళల' జాబితాలో నారా బ్రాహ్మణి
- హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఆమె సేవలకు గుర్తింపు
- అడ్డంకులను చెరిపేస్తూ ఎందరికో స్ఫూర్తిగా నిలవాలన్న లోకేశ్
- కోడలి విజయంపై హర్షం వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు
- తెలుగు ఆడబిడ్డలకు బ్రాహ్మణి స్ఫూర్తిగా నిలుస్తోందని చంద్రబాబు ప్రశంస

## ప్రపంచ వాయుసేనల్లో

# భారత్‌కు 3వ స్థానం

- వరుసగా ఐదో ఏడాది చైనాను అధిగమించిన ఐఏఎఫ్
- అమెరికా, రష్యా తర్వాత మూడో శక్తివంతమైన వాయుసేనగా గుర్తింపు
- నాణ్యత, ఆధునికీకరణ వల్లే భారత్‌కు మెరుగైన ర్యాంకు



- 1,716 విమానాలతో పటిష్ఠంగా ఉన్న భారత వాయుసేన

2లో



## మధుర గాయని ఎస్.జానకి

# గుండెపోటుతో కన్నుమూత

- ప్రముఖ గాయని ఎస్. జానకి (88) మైసూరులో కన్నుమూత
- ఆరు దశాబ్దాల కెరీర్‌లో 48 వేలకు పైగా పాటలు పాడిన గానకోకిల
- 2013లో ప్రకటించిన పద్మభూషణ్‌ను సున్నితంగా తిరస్కరించిన వైనం
- కొద్ది నెలల క్రితమే ఏకైక కుమారుడిని కోల్పోయిన జానకి

2లో

- ఆమె మృతితో భారతీయ సంగీతంలో ఒక శకం ముగిసిందన్న ప్రముఖులు

# 17 ఏళ్లకే అరుదైన గౌరవం..

- యూఎస్ నేవీ కెడెట్ ప్రోగ్రాంలో భారత సంతతి యువతికి అరుదైన గౌరవం
- 17 ఏళ్ల రిధి చౌహాన్.. 300 మంది విద్యార్థుల బెటాలియన్‌కు కమాండింగ్ ఆఫీసర్
- న్యూయార్క్‌లోని హైస్కూల్‌లో అత్యున్నత క్యాడెట్ ర్యాంకు



సాధించిన విద్యార్థిని

- రాజస్థాన్ మూలాలున్న రిధి.. భవిష్యత్తులో నేవల్ ఆఫీసర్ కావడమే లక్ష్యమని వెల్లడి

# పవన్ కల్యాణ్ రెండు భుజాలకు సర్జరీ..

## త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన చంద్రబాబు



- రొటేటర్ కఫ్ ఇంజ్యూరీస్‌తో బాధపడుతున్న పవన్
- ముంబైలోని కోకిలాబెన్ ఆసుపత్రిలో శస్త్రచికిత్స
- మూడు గంటల పాటు కొనసాగిన ఆపరేషన్

4లో

## 17 ఏళ్లకే అరుదైన గౌరవం..

# 300 మంది అమెరికా నేవీ క్యాడెట్స్‌కు లీడర్‌గా భారత సంతతి విద్యార్థిని

అమెరికాలో భారత సంతతికి చెందిన ఓ యువతి చిన్న వయసులోనే అరుదైన ఘనత సాధించి అందరి ప్రశంసలు అందుకుంటోంది. 17 ఏళ్ల రిధి చౌహాన్, న్యూయార్క్‌లోని ఓ హైస్కూల్‌లో నేవీ జూనియర్ రిజర్వ్ ఆఫీసర్స్ ట్రైనింగ్ కార్ప్స్ (ఎన్‌జేఆర్ఓటీసీ) ప్రోగ్రాంలో అత్యున్నత క్యాడెట్ ర్యాంకును కైవసం చేసుకుంది. సుమారు 300 మంది విద్యార్థులున్న బెటాలియన్‌కు 'బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్'గా బాధ్యతలు చేపట్టింది. క్వీన్స్‌లోని బెంజమిన్ ఎన్. కార్డోజో హైస్కూల్‌లో ఈ గౌరవం దక్కించుకుంది. ఈ ఉన్నత పదవిలో భాగంగా రిధి వారానికి నాలుగు రోజులు తన బెటాలియన్‌లోని క్యాడెట్ల డ్రిల్ ప్రాక్టీస్, శిక్షణ, కార్యకలాపాలు, సంక్షేమాన్ని పర్యవేక్షిస్తుంది. ఇందుకోసం తరచుగా ఉదయం 7 గంటల కన్నా ముందే పాఠశాలకు చేరుకుంటుంది. యూఎస్ నేవీ సహకారంతో నడిచే ఈ కార్యక్రమంలో విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, బృంద స్ఫూర్తిని పెంపొందించడమే ప్రధాన లక్ష్యం. ఈ పదవిని చేపట్టడం ద్వారా ఈ ప్రోగ్రాంలో విద్యార్థి నాయకత్వానికి అత్యున్నత శిఖరానికి చేరినట్టయింది. ఈ స్థాయికి రావడానికి ముందు రిధి అకడమిక్ కమాండర్, స్టెమ్ (ఎస్‌టీఈఎం) కమాండర్, ప్లాటూన్ లీడర్ వంటి పలు కీలక హోదాల్లో సమర్థవంతంగా పనిచేసింది. ఆమె అకడమిక్ కమాండర్‌గా ఉన్నప్పుడు, పాఠశాల బృందం వరుసగా రెండేళ్లు జాతీయ స్థాయి లీడర్‌షిప్ అండ్ అకడమిక్ బౌల్ రెండో రౌండ్‌కు అర్హత సాధించింది. స్టెమ్ కమాండర్‌గా, యూనిట్ కోసం మొట్టమొదటి 'సీపెర్చ్' అనే




అండర్‌వాటర్ రోబోట్‌ను నిర్మించడంలో క్యాడెట్లకు నాయకత్వం వహించింది. తన పదవీకాలంలో 200 మందికి పైగా తోటి క్యాడెట్లకు మార్గనిర్దేశం చేసింది. రిధి కుటుంబానికి రాజస్థాన్‌లోని జైపూర్‌తో మూలాలున్నాయి. ఆమె తల్లిదండ్రులు రుచికా చౌహాన్, దిలీప్ చౌహాన్. విద్య, సేవ, నాయకత్వం పట్ల తన కుటుంబం ఇచ్చిన ప్రోత్సాహం, అలాగే, బీఏపీఎస్ స్వామినారాయణ్ సంప్రదాయం నుంచి పొందిన ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం తన విలువలను తీర్చిదిద్దాయని రిధి పేర్కొంది. ఈ మూడేళ్ల కార్యక్రమంలో తాను ఎన్నో పాఠాలు నేర్చుకున్నానని, నాయకత్వం అంటే ఇతరులపై చూపించే సానుకూల ప్రభావమని అర్థం చేసుకున్నానని తెలిపింది. భవిష్యత్తులో యునైటెడ్ స్టేట్స్ నేవల్ అకాడమీలో చేరి, నేవల్ ఆఫీసర్‌గా దేశానికి సేవలు అందించడమే తన లక్ష్యమని రిధి స్పష్టం చేసింది.

## కన్నెపల్లి నుంచే రోజూ 2 టీఎంసీలు ఎత్తిపోయొచ్చు

హైదరాబాద్: మేడిగడ్డతో సంబంధం లేకుండా కన్నెపల్లి పంపుహౌస్ నుంచి రోజూ రెండు టీఎంసీల నీటిని ఎత్తిపోయవచ్చని భారాస రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. ఆ నీటితో గోదావరి బేసిన్‌లోని ఎస్సారెస్పీ, లోయర్, మిడ్ మానేరు, మల్లన్నసాగర్, బస్వాపూర్ జలాశయాలను నింపి సాగునీటి ఇబ్బందులను తీర్చవచ్చన్నారు. ఈ విషయాన్ని రిటైర్డ్ ఇంజినీర్ల అసోసియేషన్ కూడా స్పష్టం చేసిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్నది కాలం తెచ్చిన కరవు కాదని, భారాసపై కక్షతో రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ... ప్రజలపై రుద్దుతున్న కరవని మండిపడ్డారు. శనివారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో పార్టీ ముఖ్యనేతలతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. "కన్నెపల్లి పంపుహౌస్ వద్ద 96.79 మీటర్లలో నీటి ప్రవాహం ఉంది. ఇక్కడి నుంచి రోజూ 9 టీఎంసీల నీరు వృథాగా పోతోంది. ఈ ఏడాది అక్టోబరు వరకు ఇక్కడి నుంచి ఈ నీటిని ఎత్తిపోసుకోవచ్చు. ఈ ప్రాంతం నుంచే ప్రవహిస్తున్న గోదావరి నీటిని ఆంధ్రప్రదేశ్‌లోని పట్టిసీమ వద్ద అక్కడి ప్రభుత్వం ఎత్తిపోసుకుంటోంది. మరి తెలంగాణ ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదు? తన గురువుకు దక్షిణ కింద కన్నెపల్లి వద్ద నీటిని వాడుకోవడం లేదా? భారాసపై కోపముంటే మాపై కేసులు పెట్టండి.. తిట్టండి. లక్షల మంది రైతుల నోట్లో మాత్రం మట్టి కొట్టొద్దు. 2022 జులైలో భయంకరమైన వరద వస్తే కూడా తట్టుకొని మేడిగడ్డ... మేటిగడ్డగా నిలిచింది. భద్రాచలానికి రాష్ట్రంలో ప్రవహిస్తున్న నీటితో ముంపు లేదు. ఏపీలో నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు ఎత్తు పెంచడంతోనే ముంపు ఏర్పడుతుంది.

**శ్ర కాళేశ్వరం గురించి తలా తోక తెలియదు..**

కాళేశ్వరం గురించి రేవంత్‌రెడ్డికి తలా తోక తెలియదు. కన్నెపల్లి వద్ద నీళ్లను ఎత్తిపోసుకోవడానికి అవకాశం ఉన్నా రాజకీయ ద్వేషంతో కళ్లు మూసుకున్నారు. నీళ్ల కోసం రైతులు ప్రభుత్వాన్ని నిలదీస్తుండటంతో రేవంత్‌రెడ్డికి అసహనం కలుగుతోంది. ఎప్పుడూ స్థిరాస్తి వ్యాపారం.. ఎనుముల అన్నదమ్ముల గురించే కాకుండా రాష్ట్ర ప్రజల గురించి కూడా ఆలోచించాలి. రేవంత్‌రెడ్డిలో అపరిచితుడు దాగి ఉన్నాడు.

*** కాంగ్రెస్ పార్టీ ఖాతాలో రూ.3 వేల కోట్లున్నాయి**

ఒకవేళ ఇప్పుడు ఎన్నికలు జరిగితే భారాసకు 78 సీట్లు వస్తాయని రేవంత్‌రెడ్డి చేయించుకున్న అంతర్గత సర్వేలో తేలింది. దమ్ముంటే ఆ సర్వే అబద్ధమని భద్రాద్రి రాముడి సాక్షిగా సీఎం ప్రమాణం చేయాలి. పార్టీ ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఉప ఎన్నికలకు రావాలి. లేకపోతే మొత్తం శాసనసభను రద్దు చేసి ముందస్తు ఎన్నికలకు వెళితే ఏ పార్టీని ప్రజలు ఆదరిస్తారో తెలుస్తుంది. కేసీఆర్ తయారు చేసిన సైనికుడు హరీశ్‌రావు. నాలుగు పార్టీలు మారిన రేవంత్‌రెడ్డి... పార్టీ మారే విషయాలపై ఎంత తక్కువ మాట్లాడితే అంతమంచిది. సీఎం దిల్లీకి పోయి ఉదయం కాంగ్రెస్‌తో, రాత్రికి భాజపాతో కలిసి ఉంటారు. తెలంగాణ ఉద్యమ సమయంలో యువకుల ప్రాణాలు తీసిన కాంగ్రెస్ పార్టీ ఖాతాలో రూ.3 వేల కోట్లు ఉన్నాయి.' అని విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు కేటీఆర్ సమాధానం ఇచ్చారు. సమావేశంలో శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీమంత్రి ప్రశాంత్‌రెడ్డి, సీనియర్ నేతలు రాజయ్య, నామా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణికి మరో అరుదైన గౌరవం..

హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, యువ పారిశ్రామికవేత్త నారా బ్రాహ్మణి మరో అరుదైన జాతీయ స్థాయి గౌరవాన్ని అందుకున్నారు. ప్రముఖ బిజినెస్ మ్యాగజైన్ ఫార్చ్యూన్ ఇండియా ఏటా ప్రకటించే '100 మోస్ట్ ఇన్ఫ్లుయెన్షియల్ ఉమెన్' (100 మంది అత్యంత ప్రభావశీల మహిళలు) 2026 జాబితాలో ఆమెకు చోటు దక్కింది. వ్యాపారం, పరిశ్రమలు, నాయకత్వం, సామాజిక సేవ వంటి రంగాల్లో విశేషమైన కృషి చేసి, తమదైన ముద్ర వేసిన మహిళలకు ఈ ప్రతిష్టాత్మక జాబితాలో స్థానం కల్పిస్తారు. హెరిటేజ్ ఫుడ్స్ సంస్థను విజయపథంలో నడిపిస్తున్నందుకు గాను బ్రాహ్మణి ఈ గుర్తింపును పొందారు. ముఖ్యంగా, సంస్థ ప్రస్థానంలో రైతులతో బలమైన నమ్మకాన్ని నిర్మించుకోవడం, డెయిరీ రంగంలో నూతన ఆవిష్కరణలు తీసుకురావడం, రైతుల జీవనోపాధిని మెరుగుపరచడంలో ఆమె చూపుతున్న చొరవ, నాయకత్వ పటిమకు గుర్తింపుగా ఈ జాబితాలో స్థానం కల్పించారు. ఈ విజయం పట్ల ఆమె భర్త, ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా వేదికగా తన ఆనందాన్ని పంచుకున్నారు. "ఫార్చ్యూన్ ఇండియా 100 మంది ప్రభావశీల మహిళల జాబితాలో బ్రాహ్మణి చోటు సంపాదించడం ఎంతో గర్వంగా ఉంది. ఇలాగే ముందుకు సాగుతూ మరెన్నో విజయాలు సాధించాలి. అడ్డంకులను చెరిపేస్తూ మరింత మందికి స్ఫూర్తిగా నిలవాలి" అంటూ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా తన కోడలు సాధించిన ఈ ఘనతపై ప్రత్యేకంగా స్పందించి ప్రశంసలు కురిపించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ఓ పోస్ట్ చేశారు. "ఫార్చ్యూన్ ఇండియా 100 మంది శక్తిమంతమైన మహిళల జాబితాలో గుర్తింపు పొందిన బ్రాహ్మణికి హృదయపూర్వక అభినందనలు. ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు ఆమె నాయకత్వ పటిమ, అంకితభావం, నిబద్ధతకు నిదర్శనం" అని పేర్కొన్నారు. అంతేకాకుండా "ఆమె మా కుటుంబానికి గర్వకారణంగా నిలుస్తూనే, ఎందరో యువతులకు, ముఖ్యంగా మన తెలుగు ఆడబిడ్డలకు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేలా స్ఫూర్తినిస్తోంది. భవిష్యత్తులో ఆమె మరిన్ని మైలురాళ్లను అధిగమించి, అన్ని ప్రయత్నాల్లోనూ విజయం సాధించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను" అని చంద్రబాబు తన పోస్టులో తెలిపారు.

## ప్రపంచ వాయుసేనల్లో

## భారత్‌కు 3వ స్థానం.. మరోసారి చైనాను అధిగమించిన ఐఏఎఫ్

ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన వాయుసేనల జాబితాలో భారత వాయుసేన (ఐఏఎఫ్) మరోసారి తన సత్తా చాటింది. వరల్డ్ డైరెక్టరీ ఆఫ్ మోడరన్ మిలిటరీ ఎయిర్‌క్రాఫ్ట్ (డబ్ల్యుడీఎంఎంఏ) విడుదల చేసిన 2026 గ్లోబల్ ఎయిర్ పవర్ ర్యాంకింగ్స్‌లో భారత్ మూడో స్థానంలో నిలిచింది. ఈ క్రమంలో వరుసగా ఐదో ఏడాది కూడా చైనాను వెనక్కి నెట్టి తన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఈ ర్యాంకింగ్స్‌లో అమెరికాకు చెందిన వివిధ వైమానిక విభాగాలు అగ్రస్థానంలో ఉండగా, రష్యా రెండో స్థానంలో నిలిచింది. ఈ నేపథ్యంలో, స్వతంత్ర జాతీయ వాయుసేనల పరంగా విశ్లేషిస్తే అమెరికా, రష్యాల తర్వాత ప్రపంచంలోనే మూడో అత్యంత శక్తిమంతమైన వాయుసేనగా భారత్ నిలిచినట్లవుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. డబ్ల్యుడీఎంఎంఏ 'ట్రూ వాల్యూ రేటింగ్' (టీవీఆర్) ఆధారంగా ఈ ర్యాంకులను కేటాయించింది. ఇందులో భారత వాయుసేన 69.4 పాయింట్ల స్కోరు సాధించగా, చైనా వాయుసేన 63.8 స్కోరుతో వెనుకంజలో ఉంది. కేవలం విమానాల సంఖ్యనే కాకుండా వాటి సాంకేతిక సామర్థ్యం, పైలట్ల శిక్షణ, లాజిస్టిక్స్, భవిష్యత్ ప్రణాళికలు, ఆధునికీకరణ వంటి కీలక అంశాలను డబ్ల్యుడీఎంఎంఏ పరిగణనలోకి తీసుకుంది. భారత వాయుసేన వద్ద సుమారు 1,716 విమానాలు ఉన్నాయి. ఇందులో ఫైటర్ జెట్లు, హెలికాప్టర్లు, రవాణా విమానాలు సమతూకంలో ఉండటం వల్లే చైనా కంటే మెరుగైన ర్యాంకు లభించింది. అయితే, భారత వాయుసేన ముందు ప్రస్తుతం కొన్ని సవాళ్లు ఉన్నాయి. దేశ రక్షణకు అవసరమైన 42 ఫైటర్ స్క్వాడ్రన్లకు బదులుగా ప్రస్తుతం 29 మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఈ లోటును భర్తీ చేసేందుకు 180 తేజస్ ఎంకే1ఏ యుద్ధ విమానాల కొనుగోలుతో పాటు, స్వదేశీ పరిజ్ఞానంతో యుద్ధ విమానాల తయారీని ప్రభుత్వం వేగవంతం చేస్తోంది.

## నదిలో నీళ్లను నేరుగా ఎత్తిపోయగలిగితే బ్యారేజీలు ఎందుకు నిర్మించారు?

హైదరాబాద్: మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల అవసరం లేకుండానే నీటిని ఎత్తిపోసేలా ఉంటే భారీగా ఖర్చు చేసి బ్యారేజీలను ఎందుకు నిర్మించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. గత పాలకులు అన్ని రకాల తప్పులు చేసి, అవకతవకలకు పాల్పడి ఇప్పుడు తమ ప్రభుత్వంపై బురదజల్లే రాజకీయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టు బాధ్యతను నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) కమిటీకి అప్పగించడానికి ఎలాంటి అభ్యంతరం లేదని, కిలాడీ కమిటీకి మాత్రం కాదని అన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్‌రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలతో కలిసి ముఖ్యమంత్రి శనివారం ఇక్కడ సచివాలయంలో విలేకరులతో మాట్లాడారు. "నదిలో పరిగెత్తే నీళ్లను ఎత్తిపోయగలిగితే ఇంక బ్యారేజీలు ఎందుకు? భారాస మాట్లాడితే సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదు. విశ్రాంత ఇంజినీర్ల సంఘం వారు తెలంగాణ వాదుల ముసుగులో భారాస వాదన వినిపిస్తున్నారు. నీళ్లు ఎత్తిపోయాలంటున్నారు. 2015 డిసెంబరులో విశ్రాంత ఇంజినీర్లతో కమిటీ ఏర్పాటు చేస్తే మేడిగడ్డ వద్ద బ్యారేజీ వద్దు.. తుమ్మిడిహెట్టి వద్ద.. కాదంటే వేమనపల్లి వద్ద కట్టమని చెప్పింది. ఆ కమిటీలో ఉన్న శ్యాంప్రసాద్‌రెడ్డి ఇప్పుడు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. ఇలాంటి వాళ్లకు ముసుగు వేసి కిలాడీ కమిటీ మమ్మల్ని దోషులుగా చూపే ప్రయత్నం చేస్తోంది'' అంటూ విశ్రాంత ఇంజినీర్ల సంఘంపై తీవ్రస్థాయిలో మాట్లాడారు. గతంలో జరిగిన దోపిడీలు, అక్రమాలు, అవకతవకల్లో ఈ సంఘంలోని వారికి కూడా సంబంధం ఉందన్నారు.

**వారితో చేరిన ఈటల**

కిలాడీ కమిటీకి కేసీఆర్ ఛైర్మన్ కాగా, హరీశ్‌రావు సభ్యుడు. ఇప్పుడు భాజపా ఎంపీ ఈటల రాజేందర్ కూడా అందులో చేరారు. ఆయనను కాళేశ్వరం దర్యాప్తులో జస్టిస్ పీసీ ఘోష్ కూడా విచారించారు. ఈటల కూడా భారాస పల్లవినే అందుకొని మాట్లాడుతున్నారు. ఎన్డీఎస్ఏ, సంబంధిత మంత్రుల అభిప్రాయాలు తీసుకొని సూచన చేసి ఉంటే గౌరవం పెరిగేది. హరీశ్‌రావు సూచనల మేరకు మాట్లాడి గౌరవం పోగొట్టుకున్నారు. ఆయన కేంద్రంలోని ప్రభుత్వానికి సంబందించిన వ్యక్తే కదా.. కేంద్ర జలశక్తి మంత్రివద్దకు వెళ్లి ఎన్డీఎస్ఏ ఛైర్మన్‌ను పిలిపించి మాట్లాడి తాత్కాలికంగా నీళ్లు ఎత్తిపోయడానికి ఒప్పిస్తే మేము పూర్తిగా సహకరిస్తాం. ఎన్డీఎస్ఏ నిపుణులను తీసుకొస్తే అప్పగించడానికి ఎలాంటి అభ్యంతరం లేదు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో అవకతవకలు, అవినీతి ఆరోపణలపై కాళేశ్వరం కేసును సీబీఐ విచారణకు అప్పగించి 11 నెలలైంది. ఇప్పటివరకు విచారణ ఎందుకు ప్రారంభం కాలేదో ఈటల చెప్పాలి.

*** ఈఈ లేఖపై నిర్లక్ష్యం వల్లే బ్యారేజీ కూలింది**

2019 జూన్ 21న అప్పటి ముఖ్యమంత్రి కాళేశ్వరం ప్రారంభించారు. 2020 మే 18న మేడిగడ్డ బ్యారేజీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఇందులో లోపాలున్నాయి, సరిదిద్దండని నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీకి లేఖ రాశారు. సీసీ బ్లాకులు దెబ్బతిన్నాయని కూడా రాశారు. అప్పుడు ముఖ్యమంత్రిగా, నీటిపారుదల శాఖ మంత్రిగా కేసీఆర్ ఉన్నారు. ఈఈ రాసిన లేఖపై నిర్లక్ష్యం వహించడం వల్లే బ్యారేజీ కూలింది. ప్రణాళిక, డిజైన్, నిర్మాణం, నిర్వహణ అన్నింటిలో నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతూ ఎన్డీఎస్ఏ మధ్యంతర నివేదిక ఇచ్చింది. ఎన్డీఎస్ఏ అంతక్రితం ఎక్కడికీ పోలేదని, కాళేశ్వరం విషయంలోనే ఎందుకు వచ్చినట్లని హరీశ్‌రావు అడుగుతున్నారు. 2021 డిసెంబరు 20న పార్లమెంటు డ్యాం సేఫ్టీ చట్టాన్ని తెచ్చింది. నిర్వహణ, పర్యవేక్షణ, తనిఖీలు, మరమ్మతుల కోసం ఈ చట్టం చేసింది. అందుకే 2023లో మేడిగడ్డ బ్యారేజీ సంఘటన జరిగిన వెంటనే పరిశీలించి ఏడో బ్లాక్ దెబ్బతినడం వల్ల మొత్తం బ్యారేజీకే ప్రమాదం ఏర్పడిందని, నీటిని నిల్వ చేయవద్దని చెప్పింది.

## మధుర గాయని ఎస్.జానకి గుండెపోటుతో కన్నుమూత

భారతీయ సినీ సంగీత ప్రపంచంలో తనకంటూ ఒక సువర్ణాధ్యాయాన్ని లిఖించుకున్న ప్రముఖ గాయని, 'దక్షిణ భారత గాన కోకిల'గా ప్రఖ్యాతి గాంచిన ఎస్.జానకి (శిష్టా శ్రీరామమూర్తి జానకి) ఇకలేరు. గత కొంతకాలంగా వయోభారంతో బాధపడుతున్న ఆమె, శనివారం, జూలై 11న కర్ణాటకలోని మైసూరులో గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. ఆమె వయసు 88 సంవత్సరాలు. ఆరు దశాబ్దాల పాటు తన గాన మాధుర్యంతో కోట్లాది మంది సంగీత ప్రియులను మంత్రముగ్ధులను చేసిన జానకమ్మ మరణంతో భారతీయ సినీ సంగీత ప్రపంచంలో ఒక శకం ముగిసినట్లయింది. ఆమె మనవరాలు అప్సర వైద్యుల ఈ విషయాన్ని ధ్రువీకరించారు. జానకికి గుండెపోటు రావడంతో ఈ మధ్యాహ్నం 12.49 గంటలకు అపోలో ఆసుపత్రిలో చేర్చారు. అయితే, చికిత్స పొందుతూ రాత్రి 7.30 గంటలకు తుదిశ్వాస విడిచినట్టు ఆసుపత్రి వర్గాలు ప్రత్యేక బులెటిన్ ద్వారా వెల్లడించాయి. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా పల్లపట్ల గ్రామంలో 1938 ఏప్రిల్ 23న శిష్టా శ్రీరామమూర్తి, సత్యవతి దంపతులకు జానకి జన్మించారు. ఆమె తండ్రి ఆయుర్వేద వైద్యుడు, ఉపాధ్యాయుడు. బాల్యం ఎక్కువగా సిరిసిల్లలో గడిచింది. తొమ్మిదేళ్ల వయసులోనే తొలిసారి వేదికపై పాడి తనలోని గాన ప్రతిభను చాటుకున్నారు. మేనమామ సలహాతో మద్రాసు చేరిన ఆమె, ఏవీఎం స్టూడియోస్‌లో సంగీత దర్శకుడు ఆర్. సుదర్శనం వద్ద తన ప్రస్థానాన్ని ప్రారంభించారు.

## విహారంలో విషాదం.. వియత్నాంలో పడవ బోల్తాపడి 15 మంది దుర్మరణం

దిల్లీ: అందాల దీవిలో విహరించే క్రమంలో పడవ బోల్తాపడి 15 మంది భారతీయ పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 10 మంది తమిళనాడుకు చెందినవారు కాగా ముగ్గురు ఆంధ్రప్రదేశ్ వాసులు, ఇద్దరు కేరళవారు అని భారత దౌత్య కార్యాలయం వెల్లడించింది. శనివారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘోర దుర్ఘటన నుంచి 21 మందిని ప్రాణాలతో కాపాడగలిగారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. వియత్నాంలో అతిపెద్ద దీవి ఫూ క్వాక్.. పర్యాటక ఆకర్షణల్లో ఒకటి. లావా మొబైల్ సంస్థ.. లక్ష్యాలను చేరుకున్న తన డిస్ట్రిబ్యూటర్లను వియత్నాం పర్యటనకు తీసుకెళ్లింది. అందులో భాగంగా ఫూ క్వాక్ ద్వీపానికి శనివారం 36 మందితో ఒక స్పీడ్‌బోటు వచ్చింది. దీనిలో నలుగురు సిబ్బంది కాగా మిగిలిన 32 మంది భారతీయ పర్యాటకులు. తిరుగుప్రయాణంలో తీరానికి 400 మీటర్ల దూరంలోనే ఇది తిరగబడింది. సమీపంలోని ఇతర బోట్లవారు వెంటనే సాయం అందించడానికి ఆ ప్రాంతానికి చేరుకున్నారు. కాసేపటికి నౌకాదళం, తీరగస్తీ దళం, ఇతర బృందాలు కూడా అక్కడకు చేరుకున్నాయి. కొందరిని రక్షించి, తీరానికి చేర్చి ప్రథమచికిత్స అందించారు. తిరగబడిపోయిన బోటు కిందిభాగంలో పలువురు చిక్కుకుపోవడంతో సహాయక చర్యలు కష్టమయ్యాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. మృతుల్లో ఇద్దరు మహిళలు. పెద్ద కెరటం రావడంతో తమ బోటు బోల్తాపడిందని పర్యాటకుల్లో ఒకరైన నిర్మల్ కుమార్ తెలిపారు. ముందుభాగాన ఉన్నందున తాము బయటపడ్డామని, వెనకవైపు ఉన్నవారు చిక్కుకుపోయారని చెప్పారు. ప్రమాదంపై వియత్నాం ప్రధాని లే మిన్ హూంగ్ విచారణకు ఆదేశించారు.

# బొడ్రాయి గ్రామానికి ఆధ్యాత్మిక రక్షణ కల్పించే పవిత్ర చిహ్నం

* బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : బొడ్రాయి గ్రామానికి ఆధ్యాత్మిక రక్షణ కల్పించే పవిత్ర చిహ్నమని బిఆర్ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ అంగడిపేటలో నిర్వహించిన బొడ్రాయి ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ఐక్యతకు, శాంతి, సౌభాగ్యాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. మన పూర్వీకుల సంప్రదాయాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. గ్రామాల్లో జరిగే ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల మధ్య సోదరభావం, ఐక్యతను పెంపొందిస్తాయని, సమాజంలో సానుకూల వాతావరణాన్ని నెలకొల్పుతాయని తెలిపారు. గ్రామ ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ అమ్మవారి ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఉండాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో పేట్ బషీరాబాద్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ శ్రీ శ్రీ కట్ట మైసమ్మ, బంగారు మైసమ్మ, గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : జీడిమెట్ల డివిజన్ వెన్నెలగడ్డలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ కట్ట మైసమ్మ, బంగారు మైసమ్మ, గంగమ్మ తల్లి దేవాలయాలలో విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ లు హాజరై అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సిహెచ్. కృష్ణ, ఎం. వీరేష్, ఎం. శంకర్, డి.లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్ కిషన్ రావు, సీనియర్ నాయకులు కాలే నాగేష్, కుంట సిద్ధిరాములు, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, సమ్మయ్య నేత, కాలే గణేష్, బాల మల్లేష్, పద్మ, ఇందిరా రెడ్డి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే మెప్పు కోసం ఎంత మాట్లాడినా ప్రజలు వాస్తవాలు గుర్తుంచుకుంటారు

* **సుభాష్ నగర్ డివిజన్ జనరల్ సెక్రటరీ శివాజీ ముదిరాజ్**

జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : టికెట్ ఆశతో, మాజీ ఎమ్మెల్యే మెప్పు కోసం ఎంత మాట్లాడినా ప్రజలు వాస్తవాలు గుర్తుంచుకుంటారని సుభాష్ నగర్ డివిజన్ జనరల్ సెక్రటరీ శివాజీ ముదిరాజ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈరోజు ప్రజల్లో మీ మాజీ ఎమ్మెల్యే కు,మీ పార్టీ గ్రాఫ్ కూడా పడిపోయింది. ఎంత విమర్శలు చేసినా ఎన్నికల్లో ప్రజలే తగిన సమాధానం చెబుతారన్నారు. యాట్రిక్ ఎమ్మెల్యే వివేకానంద చేతిలో మూడుసార్లు ఓడిపోయిన మీరు పదివేల మంది సైన్యం ఉందని చెప్పుకోవచ్చు. కానీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఉన్న 6 లక్షల మంది ఓటర్లలో అత్యధికులు ఇప్పటికీ బీఆర్ఎస్ పార్టీకి అండగా ఉన్నారనే విషయాన్ని మర్చిపోవద్దన్నారు. మా నాయకుల గురించి విమర్శించే ముందు మీ నాయకులు ఎన్ని పార్టీలు మారారో ఒకసారి ఆలోచించాలన్నారు. సురేష్ రెడ్డి పార్టీలు మారారని మీరు చెబుతున్నారు. అయితే మీరు కూడా చెప్పుల గుర్తుపై, సమైక్య ఆంధ్ర పార్టీ తరఫున పోటీ చేయలేదా? తెలంగాణ భావజాలానికి వ్యతిరేకంగా నిలిచిన పార్టీలో మీరు లేరా? ఈ విషయాలన్నీ ప్రజలకు బాగా తెలుసునని అన్నారు. రాజకీయాల్లో హుందాతనం చాలా ముఖ్యం. మీరు పెద్ద నాయకులు కాబట్టి అదే స్థాయిలో మాట్లాడితే మంచిదని, వ్యక్తిగత విమర్శలు, అనుచిత వ్యాఖ్యలు చేస్తే ప్రజలు సహించరు పార్టీ కార్యకర్తలు సహించారన్నారు. ప్రజాప్రతినిధుల ప్రోటోకాల్‌ను పక్కన పెట్టి అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు చేయడం సరైన విధానం కాదని, ఆ నిధులు తీసుకొచ్చింది ఎమ్మెల్యే వివేక్ అని, కాబట్టి ఆయనకు తగిన గౌరవం ఇవ్వడం ప్రజాస్వామ్య మర్యాద అన్నారు. మీరు నమ్మిన మాజీ ఎమ్మెల్యే ఎవరిని కార్పొరేటర్ గా గెలిపించలేదు, మా కార్పొరేటర్లు తమ సొంత ఇమేజ్ తో గెలిచారన్నారు. గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఫలితాలు ఒక్కసారి గుర్తు చేసుకొంటే బాగుటుందన్నారు. అప్పుడు ఎవరు ఎవరిని గెలిపించారు,ఎవరిని గెలిపించుకోలేక పోయారు అనేది తెస్తుందన్నారు. చివరిగా ఒకటే... తీర్పు సోషల్ మీడియాలో కాదు, ప్రజల తీర్పు ఎన్నికల్లో ఉంటుందన్నారు.

# ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ని పరామర్శించిన శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : ఇటీవల వరంగల్ కన్నెపల్లి రిజర్వాయర్ పర్యటనకు వెళ్తున్న నేపథ్యంలో మార్గమధ్యలో జరిగిన ప్రమాదంలో స్వల్పంగా గాయపడ్డ మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ని శనివారం తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్ శంభీపూర్ లోని నివాసంలో వారిని మర్యాదపూర్వకంగా కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

# అంగన్వాడీలతో వెట్టి చాకిరీ సరికాదు

– **ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: చాలీచాలని వేతనాలతో బతుకుబండి లాగుతున్న అంగన్వాడీ టీచర్లు, ఆయాలపై పనుల భారం మోపుతూ ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయించడం దారుణమని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాటి ప్రసాద్ అన్నారు. శనివారం భద్రాచలంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ జిల్లా అధ్యక్షురాలు గోనె మణితో కలిసి నరాటి ప్రసాద్ మాట్లాడారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతల సంక్షేమంలో కీలక భూమిక పోషిస్తున్న అంగన్వాడీలను ఆదుకోవాల్సిన ప్రభుత్వమే అదనపు విధుల పేరుతో వేధింపులకు గురిచేయడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికార యంత్రాంగం నిర్వాకంతో అంగన్వాడీ వ్యవస్థ క్రమంగా కుప్పకూలుతోందని ఆరోపించారు. కనీస సౌకర్యాలు, అవసరమైన వనరులు సమకూర్చకుండా కేంద్రాలను గాలికొదిలేసి, మరోవైపు అంగన్వాడీలపై పనుల భారం మోపడం ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. అంగన్వాడీ టీచర్లకు బీఎల్ఓ విధులు అప్పగించడం కేంద్రాల నిర్వహణను పూర్తిగా దెబ్బతీస్తోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దునిద్ర వీడి అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లపై స్పందించాలని కోరారు. సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తే అంగన్వాడీల ఆగ్రహం ఉద్యమ ఉప్పెనగా మారుతుందని, రాష్ట్రవ్యాప్తంగా బలమైన పోరాటాలకు సిద్ధమవుతామని నరాటి హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరు వెంకటేశ్వరరావు రాష్ట్ర సమితి సభ్యులు రావులపల్లి రవి కుమార్, వేల్పుల మల్లికార్జున్, మండల రాజు, రత్నకుమారి చిన్నారి, కంభం మెట్టు శ్రీనివాస్ మా రెడ్డి శివాజీ ఎస్వీఎస్ నాయుడు మీసాల భాస్కరరావు భద్రాద్రి వెంకటేశ్వరరావు మహేష్,గుంజ రామారావు, సత్తినేడు సాయిరాం, రుద్ర బ్రదర్స్, చింతల రామరాజు తదితరులు పాల్గొన్నారు

# భువనగిరి సభ .. విజయవంతం చేసిన వారందరికీ కృతజ్ఞతలు

* **రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ,(ప్రజా స్ఫూర్తి): భువనగిరిలో జూలై 5న నిర్వహించిన రాజ్యాధికార సమరభేరి సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ తెలంగాణ రాజ్యాధికార పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ కృతజ్ఞతలు తెలిపారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, భూపాలపల్లి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి సభను విజయవంతం చేశారని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఇనుగాల ప్రణయ్‌రాజ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు సామల శ్రీలత, క్రమశిక్షణ కమిటీ అధ్యక్షుడు గండు కరుణాకర్, జిల్లా కోఆర్డినేటర్ మామిడి శ్రీకాంత్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు అన్నం రామ్‌చరణ్, వామినోజు రాజేందర్, సామల చంద్రశేఖర్, బుర్రి కుమార్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

# రేపు 'గూడెం' రానున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు

* **జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు, 8 మంది బీజేపీ ఎమ్మెల్యేలు సోమవారం కొత్తగూడెంలో పర్యటించనున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థకు తాడిచర్ల బొగ్గు గనులను కేటాయించిన నేపథ్యంలో వీరంతా కొత్తగూడెం పర్యటనకు వస్తున్నారన్నారు. సింగరేణి సంస్థ అభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సింగరేణిలో పనిచేస్తున్న సుమారు 40 వేల మంది కార్మికులకు కేంద్ర ప్రభుత్వం పెద్దన్న పాత్ర పోషిస్తూ, సంస్థ అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలను అందిస్తోందని చెప్పారు. మాజీ ప్రధాని వాజ్‌పేయి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం కూడా సింగరేణి సంస్థకు అవసరమైన పూర్తి సహాయ సహకారాలను అందించిందని గుర్తు చేశారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జాటోత్ వెంకన్న నాయక్, రాష్ట్ర గిరిజన మోర్చా కార్యదర్శి భూక్య రవి నాయక్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సముద్రాల గాయత్రి, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎస్.కె రెహమతుల్లా, జిల్లా మీడియా కన్వీనర్ రామారావు, ఆత్మ నిర్భర్ భారత్ జిల్లా కన్వీనర్ గొడుగు శ్రీధర్ యాదవ్, లక్ష్మీ దేవిపల్లి, చుంచుపల్లి మండలాల అధ్యక్షులు నవీన్, బలగం శ్రీధర్ పాల్గొన్నారు.

# పేదల కన్నీళ్లు తుడవడమే ప్రభుత్వ లక్ష్యం'

* **సీఎంఆర్ఎఫ్, కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీలో మంత్రి పొంగులేటి**



ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : ఆపదలో ఉన్న ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, పేదల కన్నీళ్లు తుడవడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 129 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.35,91,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులతో పాటు, ఖమ్మం రూరల్ మండలానికి చెందిన మూడు కళ్యాణలక్ష్మి చెక్కులను శనివారం ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ నిరుపేదలకు వైద్య ఖర్చుల భారం కాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయ నిధిని వేగంగా అందిస్తున్నామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి, స్థానిక కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

: **మంత్రి పొంగులేటి.**



జనగామ, ప్రజాస్ఫూర్తి : రాష్ట్ర వ్యాప్తంగా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా భూ రీ సర్వే ను అత్యంత ప్రాధాన్యంతో చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఖమ్మం నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వ హించిన వీడియో కాన్ఫరెన్స్‌లో భూ రీ సర్వే, భూ భారతి అమలు, సాదాబైనా మా దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్లు, 2 బీహెచ్‌కే ఇళ్ల పంపిణీ తదితర అంశాల పై సమీక్షించారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్ షా లోం తో కలిసి జిల్లా సమీకృత కలెక్టరేట్ నుంచి సమావేశంలో పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ, భూ భారతి విజయవంతమైన అమలుకు భూ రీ సర్వే కీలకమని, మార్చి 2027 నాటికి మూడు విడతల్లో రీ సర్వే పూర్తి చేయాలని సూచించారు. రీ సర్వేలో పనిచేసే లైసెన్స్ సర్వేయర్లకు ఎకరానికి రూ.60 చెల్లిస్తామని, జూలై 28 లోపు విధుల్లో చేరని సర్వేయర్ల లైసెన్సులు రద్దు చేయాలని ఆదేశించారు. సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని, మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి, పెండింగ్‌లో ఉన్న రెండు పడక గదుల ఇళ్లను లబ్ధిదారులకు త్వరగా అందజేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం చేపట్టిన భూ రీసర్వేతో రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

# అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యం స్వాధీనం

* **ఒకరిపై కేసు నమోదు**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ,(ప్రజా స్ఫూర్తి): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ (రేషన్) బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఒకరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు జిల్లా సీసీఎస్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో మొగుళ్లపల్లి మండలం అకినపల్లి గ్రామానికి చెందిన గౌరిశెట్టి కృష్ణమూర్తి తన కిరాణా దుకాణంలో సుమారు 6 నుంచి 7 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించారు. దీంతో సీసీఎస్ పోలీసులు దాడి నిర్వహించి బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, నిందితుడిని మొగుళ్లపల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.ప్రభుత్వ పథకాల కింద లబ్ధిదారులకు అందాల్సిన పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేయడం, నిల్వ చేయడం లేదా విక్రయించడం చట్టరీత్యా నేరమని పోలీసులు హెచ్చరించారు. ఇటువంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా జిల్లా పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

# తెలంగాణ ఉద్యమకారుల వినతుల స్వీకరణకు 17న సమావేశం



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (ప్రజాస్ఫూర్తి): తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, సంక్షేమ పథకాల అమలు అంశాలపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సమావేశాన్ని ఈ నెల 17న విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర సహాయ కార్యదర్శి మందల రవీందర్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గత తొమ్మిదేళ్లుగా సాగిన పోరాట ఫలితంగానే ప్రభుత్వం గుర్తింపు కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. హైదరాబాద్ సచివాలయం ఎదురుగా ఉన్న అమరవీరుల స్థూపంలోని అమరజ్యోతి ప్రాంగణంలో కమిటీ అధ్యక్షుడు కే.కేశవరావు నేతృత్వంలో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాలకు చెందిన తొలి, మలి దశ తెలంగాణ ఉద్యమకారులు, వివిధ ఉద్యమ సంఘాల ప్రతినిధుల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, ఉద్యమ సంఘాల ప్రతినిధులు, ఉద్యమకారులు తమ సమస్యలు, డిమాండ్లు, సలహాలు, సూచనలతో కూడిన వినతిపత్రాలను కమిటీకి సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# ఇంటింటికి వెళ్లి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



ప్రజాస్ఫూర్తి,మెదక్ జిల్లా: ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) ద్వారా మంజూరైన చెక్కులను అర్హులైన 33 మంది లబ్ధిదారులకు మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్‌గౌడ్ కాంగ్రెస్ నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి అందజేశారు.ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా దొంతి నరేష్‌గౌడ్ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గంగాధర్, నాయకులు బొజ్జ పవన్, భూపతి రాజ్, బాలరాజ్,బుద్ద రాజు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతు ఆశీర్వాద సభ కాదు.. అబద్ధాల సభ

*** బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు లావుడ్యా సత్యనారాయణ నాయక్**



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన "రైతు ఆశీర్వాద సభ" కేవలం ప్రజలను తప్పుదోవ పట్టించే ఒక పచ్చి అబద్ధాల సభ అని, రైతులను ఆశీర్వదించడానికి కాదు, వారిని వంచించడానికి పెట్టిన సభ అని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అధ్యక్షులు లావుడ్యా సత్యనారాయణ నాయక్ తీవ్రంగా ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , జిల్లా కాంగ్రెస్ మంత్రులు వేదికపై చెప్పినవన్నీ ఒట్టి బూటకపు మాటలేనని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి రైతాంగాన్ని నట్టేట ముంచిందని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రజలు కేసీఆర్ పాలన కోరుకుంటున్నారని ఆయన అన్నారు.

# వర్షాకాలంలో డెంగ్యూపై అప్రమత్తంగా ఉండాలి

*** జిల్లా వైద్య , ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. రామారావు**

ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : ప్రపంచ జనాభా దినోత్సవం, జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని , వర్షాకాలంలో డెంగ్యూపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య , ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. రామారావు అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఈ నెల 13వ తేదీన నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నేపథ్యంలో జిల్లా వైద్య , ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. రామారావు శనివారం ఖమ్మం పట్టణంలోని కొత్తూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, ఉపాధ్యాయులు , సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ జనాభా నియంత్రణ, తల్లిశిశు ఆరోగ్యం, సమతుల్య కుటుంబ వ్యవస్థ, బాలికల ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా అర్హులైన



ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఆల్బెండాజోల్ మాత్రలు తీసుకోవాలని, దీనివల్ల నులిపురుగుల వల్ల కలిగే రక్తహీనత, పోషకాహార లోపం, ఎదుగుదలలో ఆటంకాలు వంటి సమస్యలను నివారించవచ్చని వివరించారు. వర్షాకాలం ప్రారంభమైనందున దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై ప్రత్యేక అప్రమత్తత అవసరమని తెలిపారు. ముఖ్యంగా డెంగ్యూ నివారణకు ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, నీటి నిల్వ పాత్రలను తరచూ శుభ్రపరచాలని, కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, ప్లాస్టిక్ డబ్బాలు, కూలర్లలో నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జ్వరం వచ్చిన వెంటనే స్వీయ వైద్యం చేయకుండా సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. అనంతరం పాఠశాల వంటగదిని పరిశీలించి, ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత, తాగునీటి సదుపాయాలు, వంట పాత్రల శుభ్రత, ఆహార నిల్వ విధానాలను తనిఖీ చేశారు. విద్యార్థినులకు నాణ్యమైన, పోషకాహారం అందించేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా హెచ్‌పీవీ టీకా యొక్క ప్రాముఖ్యతను వివరించిన డాక్టర్ డి. రామారావు, అర్హులైన బాలికలు తప్పనిసరిగా హెచ్‌పీవీ టీకా తీసుకోవాలని, ఈ టీకా భవిష్యత్తులో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నుంచి రక్షణ కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు ఎటువంటి అపోహలకు లోనుకాకుండా తమ కుమార్తెలకు టీకా వేయించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, చేతులను సబ్బుతో తరచుగా కడుక్కోవడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు అలవరుచుకోవడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని జిల్లా వైద్య , ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. రామారావు సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ మహేందర్ రెడ్డి, పి హెచ్ సి ఎం వి పాలెం నుంచి , హెచ్ఈఓ బద్రు ఆశాలు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను నెల పొడిగించాలి

**- బోలగోని సత్యనారాయణ**




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ఓటర్లను చైతన్యం చేయడంలో అధికార యంత్రాంగం విఫలమైందని.. ఎస్ఐఆర్ ప్రక్రియను నెల రోజులపాటు పొడిగించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగొని సత్యనారాయణ అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో శనివారం సిపిఐ మండల సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ జాబితా సవరణ కార్యక్రమంలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ లో చాలా మందికి ఇప్పటివరకు ఎన్యుమరేషన్ ఫారాలు అందలేదని, ఫారాలు నింపడంలో సరైన అవగాహన లేక ఓటర్లు తెలిసి తెలియక పూర్తి చేసి ఇబ్బందులు గురి అవుతున్నారన్నారు. ఓటర్లను బి ఎల్ వో లు తమ దగ్గరికే వచ్చి ఫారలు తీసుకోవాలని చెబుతున్నారని, ఇంటింటికి తిరిగి ఫారాలు పంపిణి చేయడం లేదని ఆరోపించారు. గ్రామ స్థాయిలో గ్రామ సభలు నిర్వహించి ఓటర్లకు సరైన అవగాహనా కల్పించే విధంగా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియ అనేది పారదర్శకంగా జరగాలి తప్ప బిజెపి వ్యతిరేక ఓట్లను తొలగించే కుట్రగా చేయకూడదని డిమాండ్ చేశారు. ఓటర్లను గుర్తించడం ఆలస్యం వల్ల మరో నెల రోజులు పొడిగించి న్యాయమైన ఏ ఒక్కరి ఓటు కూడా గల్లంతు కాకుండా చూడాలని కోరారు. ఈ సమావేశంలో సిబిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి ఎండి ఇమ్రాన్, మున్సిపాలిటీ కార్యదర్శి పగిల్ల మోహన్ రెడ్డి, ఉడత రామలింగం, కొండూరి వెంకటేష్, దాసరి అంజయ్య, టంగుటూరు రాములు, రోషణగారి అంజయ్య, రొండి నర్సింహా, బద్దుల సుధాకర్, రొండి నరసింహ, నీళ్ల బిక్షపతి, కాకి పాండు, కుంటి పాపయ్య, దాసరి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులకు అండగా ఉండి ఆదుకుంటాం

*** రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు కె.యం.ప్రతాప్**

జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : కార్మికులకు అండగా ఉండి ఆదుకుంటామని రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, శ్రమశక్తి అవార్డు గ్రహీత, కె.యం.ప్రతాప్ అన్నారు. ఐ.డి.ఏ.జీడిమెట్ల,ఫేస్ 5,రోడ్ నెంబర్ 5 లో నడుస్తున్నటువంటి సామంతుల ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో గత ఆరు సంవత్సరాలుగా పనిచేయుచున్న కార్మికులకు, వారి యొక్క నెలసరి జీతభత్యాల నుండి ఈ.ఎస్.ఐ. , పి.ఎఫ్. డబ్బులు మినహాయిస్తూ ఈ.ఎస్.ఐ. పి.ఎఫ్. డబ్బులు కట్టకుండా కాలయాపన చేస్తున్నారని, తమకు న్యాయం



చేయించమని కార్మికులు కోరగా, ప్రతాప్ వెంటనే స్పందించి తెలంగాణ రాష్ట్ర కార్మిక,ఉపాధి కల్పన, ఫ్యాక్టరీస్, శిక్షణ, మైనింగ్, జియాలజీ శాఖ మాత్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి ని కలిసి సామంతుల ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ యాజమాన్యం వారు చేపడుతున్నటువంటి పి.ఎఫ్. ఈ.ఎస్.ఐ. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై చట్టపరమైన చర్యలు తీసుకొని,కార్మికులకు న్యాయపరంగా రావలసిన పి.ఎఫ్. డబ్బులను, ఈ.ఎస్.ఐ. బెనిఫిట్స్ను ఇప్పించమని కోరారు. ఈ సందర్భంగా కార్మిక శాఖ మాత్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి సానుకూలంగా స్పందించి, సంబంధించిన అధికారులతో వెంటనే ఫోన్లో మాట్లాడారు, సామంతుల ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ పై చట్టపరమైన చర్యలు చేపట్టి, కార్మికులకు న్యాయం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సామంతుల ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# గౌతంపూర్‌లో సర్ పై సహాయక కేంద్రం ప్రారంభం



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం : కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని చూచుపల్లి మండలంలో గల గౌతంపూర్ గ్రామం నందు బీజేపీ రాష్ట్ర నాయకులు తాండ్ర వినోద్ రావు పిలుపు మేరకు, సోప్పరి క్రాంతి ఆధ్వర్యంలో సర్ కార్యక్రమం పై సహాయ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సోప్పరి క్రాంతి మాట్లాడుతూ ఓటర్లకు సర్ ప్రక్రియపై అవగాహన కల్పించడంతో పాటు, ఎన్యూమరేషన్ ఫారాలు నింపడం, అవసరమైన పత్రాల సమర్పణ, ఆన్‌లైన్ నమోదు, ఇతర సందేహాల నివృత్తి కోసం సహాయక కేంద్రాన్ని ప్రారంభించినట్లు ఆయన తెలిపారు .ప్రతి అర్హత కలిగిన ఓటరు సర్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేసుకోవాలని, ఈ సహాయక కేంద్రం ద్వారా ఉచితంగా సేవలు అందించబడతాయని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటు హక్కుకు సంబంధించిన ప్రక్రియలను పూర్తి చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో 11వ వార్డు మెంబర్ ఎర్ర ప్రియాంక, మండల ప్రధాన కార్యదర్శి రతన్లాల్ పాసి, గంటా శ్రీను, కోళ్ల హరీష్, సంటి వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు .

# పట్టణ ఆర్యవైశ్య మహాసభ మహిళా కమిటీ సభ్యులకు నియామక పత్రాలు




అందజేత ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: జూలై నెల 19 ఆదివారం సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య మహాసభ నూతన కమిటీ, మహిళా ప్రమాణ స్వీకారం మహోత్సవాన్ని పురస్కరించుకొని జమ్మిగడ్డలోని దత్త సాయి మందిరంలో నూతన మహిళా కమిటీ సభ్యులకు నియామక పత్రాలను జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు వెంపటి వెంకటేశ్వరరావుతో కలిసి ఆర్యవైశ్య సంఘం పట్టణ మహిళా అధ్యక్షురాలు మిట్టపల్లి శ్రీదేవి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 19 లో జరిగే నూతన కమిటీ ప్రమాణ స్వీకారాన్ని విజయవంత చేయాలని అన్నారు. పట్టణ ఆర్యవైశ్య మహాసభ తోపాటు యువజన సంఘం మహిళా సంఘం సంయుక్తంగా మహాసభ ద్వారా పేద ఆర్యవైశ్యులకు సేవలందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ పట్టణ మాజీ అధ్యక్షులు సీనియర్ నాయకులు కర్నాటి కిషన్,, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బండారు రాజా, జిల్లా కోశాధికారి జిల్లా చల్లా లక్ష్మీకాంత్, సూర్యాపేట పట్టణ అధ్యక్షులు బెలిదే శ్రీనివాసులు, సెక్రటరీ బికుమల కృష్ణ, కోశాధికారి ఉప్పల శ్రవణ్ కుమార్, మాజీ అధ్యక్షులు మంచాల రంగయ్య పొలిటికల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్, గౌరవ సలహాదారులు మిట్టపల్లి రమేష్, గౌరవ అధ్యక్షురాలు బ్రాహ్మణపల్లి తరంగిణి, వర్కింగ్ ప్రెసిడెంట్ బెలిదే రాధ, సెక్రటరీ లకుమారపు పద్మజ, కోశాధికారి ఓరుగంటి లావణ్య, రాష్ట్ర మహిళ నాయకులు దేవరశెట్టి ఉమారాణి, తేల్లాకుల శ్రీదేవి మరియు ఉపాధ్యక్షులు , సహాయ కార్యదర్శిలు,కార్యవర్గ సభ్యులు మహిళలు పాల్గొన్నారు.

# త్రినిటీలో ఆరెంజ్ కలర్ సంబరాలు




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రం ట్రినిటీ హై స్కూల్ ఐఐటి జోన్ లో శనివారం ఆరంజ్ కలర్ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సంబరాలకు ముఖ్యఅతిథిగా ట్రినిటీ హై స్కూల్ ప్రిన్సిపాల్, డైరెక్టర్ ఉజ్జిని మంజుల ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పిల్లలకు వివిధ కలర్స్ పై అవగాహన కల్పించడంలో భాగంగా కాషాయం కలర్ గురించి పిల్లలకు వివరించారు. అదేవిధంగా ఆరంజ్ కలర్స్ లో ఉన్న వివిధ రకాల పండ్లను, వివిధ రకాల స్వీట్స్ ని ప్రదర్శించారు. ఆరంజ్ కలర్స్ లో ఉన్న పండ్లను తినడం వలన సి విటమిన్ పుష్కలంగా లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రినిటీ హై స్కూల్ చైర్మన్ కేవీబీ కృష్ణారావు, ఐఐటి జోన్ ఇంచార్జ్ అనుష, కోఆర్డినేటర్ చందన, ఉపాధ్యాయులు శిరీష, హారిక, రత్న, భార్గవి, సింధు, లావణ్య, రేణుక తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన హక్కుల రక్షణ కోసం పెద్ద ఎత్తున పోరాటాలు




ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: గిరిజన హక్కుల రక్షణ కోసం రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున రాజీలేని పోరాటాలు నిర్వహించాల్సి ఉంటుందని తెలంగాణ గిరిజన సమాఖ్య (టిజిఎస్) రాష్ట్ర అధ్యక్షులు అజ్మీర రామ్మూర్తి నాయక్ అన్నారు. పాల్వంచ పరిధిలో ఈ నెల 18, 19 తేదీల్లో నిర్వహించనున్న టీజీఎస్ 3వ రాష్ట్ర మహాసభల ప్రచార కరపత్రాలను శనివారం కొత్తగూడెంలోని శేషగిరి భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలు, సవాళ్లు, వారు సాగిస్తున్న పోరాటాలు తదితర కీలక అంశాలపై ఈ మహాసభల్లో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. గిరిజన సమాజం అంతా ఏకమై ఈ రాష్ట్ర మహాసభల ఏర్పాట్లను వేగవంతం చేయాలని, మహాసభలను విజయవంతం చేయడానికి శ్రేణులంతా కదలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ బి వెంకట్, నాయకులు జర్పుల ఉపేందర్, బానోతు వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలు



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలు అభిమానుల సమక్షంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు. స్వీట్లు పంపిణీ చేశారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షురాలు కడారి కల్పన ఐలయ్య యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దూడల బిక్షం గౌడ్, సీనియర్ నాయకులు రమణగోని శంకరయ్య, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, ఉబ్బు బుచ్చయ్య, గుండెబోయిన వేణు, బూత్ అధ్యక్షుడు ప్రవీణ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం

*** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కళ్ల పల్లి రవీందర్ రావు**

మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం అని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కల్లపల్లి రవీందర్ రావు అన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో క్లబ్ ముందంజలో ఉందని అభినందించారు. జిల్లా కేంద్రంలోని ఎస్వీఎం ఫంక్షన్ హాల్ లో శుక్రవారం రాత్రి రోటరీ క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. మహబూబాబాద్ రోటరీ క్లబ్ నూతన అధ్యక్షుడిగా దూది కట్ల సత్యం బాధ్యతలు స్వీకరించారు. ముఖ్య అతిథి ఎన్ వి హనుమంత రెడ్డి ఇన్స్టాలేషన్ ఆఫీసర్గా విచ్చేసి నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు. రోటరీ క్లబ్ ఆశయాలు సాధించిన విజయాలు సేవా కార్యక్రమాలను వివరించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ తక్కల్లపల్లి రవీంద్రరావు హాజరై ప్రసంగించారు. ప్రతి వ్యక్తి సమాజం పట్ల బాధ్యతతో మెలగాలని తన వంతుగా సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. ప్రతి వ్యక్తి తన సంపాదనలో కొంత భాగం తప్పనిసరిగా తన చుట్టూ ఉన్న సమాజ సేవకు నియోగించాలని కోరారు మాధవ సేవ కంటే మానవసేవే గొప్పదని తెలిపారు ఇన్స్టాలేషన్ ఆఫీసర్ మరియు రోటరీ ఫౌండేషన్ చైర్మన్ హనుమంత రెడ్డి గారు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా రోటరీ అనేక దేశాలలో సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్న అన్నారు పోలియో రహిత ప్రపంచంగా తయారు చేయడంలో రోటరీ పాత్ర లాగనీయమన్నారు అంతేకాకుండా నిరుక్షరాస్యత నిర్మూలనకు పర్యావరణ పరిరక్షణకు మహిళా సాధికారతకు ప్రపంచ శాంతికి రోటరీ కట్టుబడి ఉందని ఈ దిశగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షులుగా దూది కట్ల సత్యం, కార్యదర్శిగా శంతన్ రామరాజు, ట్రెజరర్గా ముల్లంగి మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ రత్నాకర్ రావు,కొండలరావు, వైద్యనాథ్, చాప్టర్ ప్రెసిడెంట్ మాలే నాగేశ్వరరావు, జిల్లా నాయకులు వర్తుల సురేందర్ రెడ్డి, బిక్కి వెంకటేశ్వర్లు దోర్నాల నగేష్ కుమార్, బొల్లం శ్రీనివాస్,కొడాలి నాగేంద్రరావు, బోయినపల్లి సతీష్ రావు, హత్య శ్రీనివాస్, మహిపాల్ రెడ్డి,వెంకట్ రెడ్డి, మల్లాల రమేష్, ఫాస్ట్ ప్రెసిడెంట్ వేమిశెట్టి కిషోర్, జంగాల విజయ్ కుమార్, నాళ్ళ వీరన్న, జంగాల మంగపతి రావు,విజయ్ నరసింహారావు గుప్తా, యువజన శివకుమార్, కట్ల వెంకన్న, ఇమ్మడి కృష్ణమూర్తి, తోడేటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# రఘునాథపల్లి జాతీయ రహదారిపై యువకుడు మృతి



రఘునాథపల్లి/జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా లోని హైదరాబాద్ - వరంగల్ జాతీయ రహదారి పై రఘునాథపల్లి మండల కేంద్రంలో శనివారం సాయంత్రం ఓ యువకుడు మృతి చెందాడు. హనుమకొండ జిల్లా కాజీపేటకు చెందిన సోమ సురేందర్ (23) తిరుపతి నుండి స్వస్థలానికి తిరిగి వస్తుండగా మార్గమధ్యం లో ఈ ఘటన జరిగినట్లు సమాచారం.స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. మృతికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# సీతారాం తండా గ్రామంలో స్కూల్ విద్యార్థులకు బ్యాగ్, నోట్ పుస్తకాల పంపిణీ




ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: యూత్ ఫర్ సేవ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా సీతారాం తండా గ్రామంలో శనివారం స్కూల్ విద్యార్థులకు బ్యాగ్ , నోటి పుస్తకాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో యూత్ ఫర్ సేవ ముఖ్య సలహాదారుడు ప్రొఫెసర్ మల్లికార్జున్ రెడ్డి, గీతం విశ్వవిద్యాలయం మాట్లాడుతూ యూత్ ఫర్ సేవ్ అనేది యువతలో సేవా భావాన్ని పెంపొందించి, సమాజ అభివృద్ధికి వారిని భాగస్వాములుగా చేసే స్వచ్ఛంద సేవా సంస్థ. ఇది 2007లో స్థాపించబడింది. విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, ఉపాధి, యువజన నాయకత్వ వికాసం వంటి అనేక రంగాలలో సేవలు అందిస్తోంది. స్వచ్ఛంద సేవకులను సమాజ అవసరాలకు అనుసంధానం చేసి, సేవా కార్యక్రమాలలో పాల్గొనేలా ప్రోత్సహిస్తుంది. పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులకు మార్గదర్శకత్వం, మొక్కల నాటడం, పరిశుభ్రత కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు వంటి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. సమాజ పట్ల బాధ్యత, కరుణ, సేవా దృక్పథం, నాయకత్వ లక్షణాలను యువతలో పెంపొందించడం ఈ సంస్థ ప్రధాన లక్ష్యం. ప్రతి పౌరుడు సమాజ అభివృద్ధికి తన వంతు బాధ్యతను నిర్వర్తించాలనే భావనను ఈ సంస్థ ప్రోత్సహిస్తుంది. సేవ ద్వారా వ్యక్తిత్వ వికాసంతో పాటు సమాజంలో సానుకూల మార్పును తీసుకురావడమే యూత్ ఫర్ సేవ యొక్క ప్రధాన ధ్యేయం అని తెలియజేశారు. స్కూల్ బ్యాగుల పంపిణీ కమల్ సురేష్ ప్రత్యేక చొరవతో చేయడం జరిగిందని తెలుపుతూ రానున్న రోజుల్లో యూత్ ఫర్ సేవా తరపున మరిన్ని సహాయ కార్యక్రమాలు చేస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏబీవీపీ ఆల్ ఇండియా స్టేట్ యూనివర్సిటీ స్ కో కన్వీనర్ కమల్ సురేష్,సర్పంచ్ కంలీమోహన్, స్కూల్ హెడ్మాస్టర్ యాదగిరి,యూత్ ఫర్ సేవ కార్యకర్తలు తేజ, విశాల్ మరియు గ్రామ పెద్దలు కేతావత్ లక్ష్మణ్, రవి,రాజు,మంగీలాల్, ఫుల్ సింగ్, అంజి, హరియా,సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# అర్చక సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షునిగా గొడవర్తి చక్రధరాచార్యులు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ పట్టణంలోని అనంతాద్రి దేవస్థానంలో నిర్వహించిన జిల్లా డీడీఎన్ అర్చకుల సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న డీడీఎన్ అర్చకులు సమావేశానికి హాజరై జీతాల సమస్యలు, దేవాలయాల అభివృద్ధి, అర్చకుల సంక్షేమం, ప్రభుత్వ పరంగా పరిష్కరించాల్సిన అంశాలపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన గొడవర్తి చక్రధరాచార్యులు మాట్లాడుతూ, జిల్లాలోని డీడీఎన్ అర్చకులందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి వారి హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వం దృష్టికి అర్చకుల సమస్యలను తీసుకెళ్లి పరిష్కారం కొరకు కృషి చేస్తానని, ప్రతి అర్చకుడికి సంఘం అండగా ఉంటుందని పేర్కొన్నారు.నూతనంగా జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన గొడవర్తి చక్రధరాచార్యులను సమావేశంలో పాల్గొన్న అర్చకులు, పలువురు ప్రముఖులు శాలువా కప్పి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గౌరవ సలహాదారు సముద్రాల లక్ష్మీనరసింహాచార్యులు,గౌరవాధ్యక్షులు కృష్ణమాచార్యులు, వేంకటేశ్వర చార్యులు, సత్య, శ్రీనివాస్, బొల్లోజు శ్రీనివాసాచార్యులు, వేణుగోపాలాచార్యులు, సుదర్శన ఆచార్యులు, రంగబట్టర్ విజయ్ కుమార్ ఆచార్యులు,రాజాసాదు,బిచ్చాసాదు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మోత్కుపల్లి నర్సింహులు జన్మదిన వేడుకలు

* **అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి రూ.10 వేల ఆర్థిక సాయం**



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: మాజీ మంత్రి, మాదిగ మహాశక్తి వ్యవస్థాపకుడు మోత్కుపల్లి నర్సింహులు జన్మదిన వేడుకలను శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరిపారు. జన్మదినాన్ని పురస్కరించుకుని మోదీన్‌పురం గ్రామానికి చెందిన, కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓ ముస్లిం సోదరుడికి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమాన్ని సీడ్స్ ఫౌండేషన్ చైర్మన్ డా.సగరపు ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డా.సగరపు ప్రసాద్ మాట్లాడుతూ మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు నాలుగు దశాబ్దాలకు పైగా ప్రజా జీవితంలో కొనసాగుతూ పేదలు, బడుగు బలహీన వర్గాల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేశారని కొనియాడారు. ముఖ్యంగా దళితుల హక్కుల కోసం శాసనసభలోనూ, ప్రజా వేదికలపైనా గళమెత్తిన నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. తెలంగాణలో మాదిగ సామాజిక వర్గానికి రాజకీయ ప్రాధాన్యం కల్పించాలనే లక్ష్యంతో 'మాదిగ మహాశక్తి' సంస్థను స్థాపించి సామాజిక చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్న మోత్కుపల్లి నర్సింహులుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన ప్రజాసేవ మరింత కాలం కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమం లో నేతలు ప్రొఫెసర్ గురునాదం, డాక్టర్ లింగయ్య, నాయకులు రాములు, శ్రీను, అశోక్ ,మల్లమ్మ, వేణు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటిన గురుకులాల కార్యదర్శి



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిర నగర్ గురుకుల కాలేజ్ పర్యటనకు రాష్ట్ర గురుకురాల కార్యదర్శి సీతమలక్ష్మి వచ్చిన సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ప్రజా హృదయం స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు హరిత మిత్ర అవార్డు గ్రహీత దైద వెంకన్న ఆధ్వర్యంలో ఇందిరానగర్ గురుకుల కాలేజీ లో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పౌరుడు మొక్కలు నాటలని పిలుపు నిచ్చారు.పర్యావరణపై విద్యార్థిని విద్యార్థులకు. అవగాహనా కల్పించాలని జీవవైవిధ్యన్ని కాపాడవాల్సిన బాధ్యత మన అందరి పైన ఉందని అన్నారు. అదనపు కార్యదర్శి నటరాజన్. ఆర్సిఓ రత్నకుమారి.డిసిఓ అశోక్ కుమార్ ప్రిన్సిపాల్. ఉపాధ్యాయలు తదితరులు పాల్గొన్నారు.

# నేడు అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్న మంత్రి గడ్డం వివేక్



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: చుంచుపల్లి మండలం హౌసింగ్ బోర్డు కాలనీలోని నందా తండా గ్రామపంచాయతీలో నూతనంగా భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు విగ్రహ స్థాపన కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం చుంచుపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహాన్ని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, పరిశ్రమలు, గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సంబశివరావు, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారని చెప్పారు. ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, సామాజిక సంస్థల నాయకులు, విద్యార్థులు, యువజన సంఘాలు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో కమిటీ అధ్యక్షుడు తుంపురి శివ, కార్యదర్శి తాండ్ర వెంకటేశ్వర్లు, సభ్యులు శనగ వెంకటేశ్వర్లు, గొనె శ్రీకాంత్, గుర్రం లక్ష్మణ్, గడ్డం రగన్ బాబు, శనగ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# మాస్టర్ ప్లాన్ అమలుకు మున్సిపాలిటీ కసరత్తు..!

* **ట్రాఫిక్ రద్దీకి చెక్.. రోడ్డు విస్తరణకు సిద్ధమైన మున్సిపాలిటీ**



జనగామ, ప్రజాస్ఫూర్తి : పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు జనగామ మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్ అమలుకు కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా నెహ్రూ పార్కు నుంచి రైల్వే స్టేషన్ మీదుగా స్లాటర్ హౌస్ వరకు ఉన్న 60 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డులోని ఆక్రమణలను తొలగించాలని మున్సిపల్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.వ్యాపారులు తమ వస్తువులను దుకాణాల పరిధిలోనే ఉంచాలని, రోడ్డుపై ఎలాంటి విక్రయాలు నిర్వహించరాదని సూచించారు. రోడ్డు విస్తరణ పనులు త్వరలో ప్రారంభం కానున్నందున ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని కోరారు. లేనియెడల తెలంగాణ మున్సిపాలిటీస్ చట్టం - 2019 ప్రకారం ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండానే ఆక్రమణలను తొలగిస్తామని, వాటి వల్ల జరిగే నష్టానికి సంబంధిత వ్యాపారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని కమిషనర్ హెచ్చరించారు. పట్టణ అభివృద్ధి, ట్రాఫిక్ సౌలభ్యం కోసం వ్యాపారులు, ప్రజలు మున్సిపాలిటీకి పూర్తి సహకారం అందించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

# చిన్న కుటుంబంతోనే ఆరోగ్యకరమైన, సుస్థిర జీవనం

* **డీఎంహెచ్‌వో డా. మధుసూదన్**




జయశంకర్ భూపాలపల్లి జిల్లా , ప్రజాస్ఫూర్తి : ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శనివారం ఐడీఓసీలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. మధుసూదన్ మాట్లాడుతూ జూలై 11 నుంచి 18 వరకు జిల్లా వ్యాప్తంగా జనాభా నియంత్రణ, మాతా-శిశు సంరక్షణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. బిడ్డకు బిడ్డకు మధ్య కనీసం మూడు సంవత్సరాల విరామం ఉండేలా కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలని సూచించారు. దీంతో తల్లి, శిశువు ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. బాల్య వివాహాలను నిరోధించాలని, ఆర్థికాభివృద్ధి, ఆరోగ్యం, విద్య, సమానత్వం, బాధ్యతాయుత జీవన విధానం చిన్న కుటుంబంతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ ఏడాది ప్రపంచ జనాభా దినోత్సవం థీమ్ "యువత ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చడం.. నేడు మరియు భవిష్యత్తు కోసం" అని తెలిపారు. తెలంగాణలో పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా కుటుంబ నియంత్రణ, ఆరోగ్య సంరక్షణ, సుస్థిర అభివృద్ధిపై అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు. విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో జనాభా నియంత్రణ, వనరుల సద్వినియోగంపై ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఈ నెల 13న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఎంహెచ్‌వో పిలుపునిచ్చారు. అనంతరం కుటుంబ నియంత్రణ కార్యక్రమంలో ఉత్తమ సేవలు అందించిన *డా. దివ్య (జీజీహెచ్), డా. కేజీయా (గైనకాలజిస్టు), డా. రోహిణి (భూపాలపల్లి), ఏఎన్ఎం శ్రీలత (మొగుళ్లపల్లి), ఆశా కార్యకర్త రాజశ్రీ (పొట్లపల్లి గ్రామం), కుటుంబ నియంత్రణలో ఆదర్శంగా నిలిచిన మధుమిత (రాజీవ్ కాలనీ, భూపాలపల్లి)*లను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో పీవోలు డా. శ్రీదేవి, సందీప్, డెమో కె. శ్రీదేవి, ఏఎంఒ సుధాకర్, సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నేరాల కట్టడికే కార్డెన్ సెర్చ్



* **మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజల సహకారం అవసరం: చిట్యాల సీఐ దగ్గు మల్లేష్**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మొగుళ్లపల్లి, (ప్రజా స్ఫూర్తి): నేరాల నియంత్రణ, అక్రమ కార్యకలాపాల నిర్మూలన లక్ష్యంగా కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చిట్యాల సీఐ దగ్గు మల్లేష్ తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం మేదరమెట్ల గ్రామంలో శనివారం తెల్లవారుజామున మొగుళ్లపల్లి ఎస్ఐ ముప్పు సురేష్ ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ఇళ్లతో పాటు పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహనాలను పరిశీలించి, అవసరమైన పత్రాలు లేని వాహనాలకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా సీఐ దగ్గు మల్లేష్ మాట్లాడుతూ, సమాజానికి పెను ముప్పుగా మారుతున్న మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సరిహద్దులో సైనికుడిలా అప్రమత్తంగా ఉండి పోలీసులకు సహకరించాలని కోరారు. అనుమానాస్పద వ్యక్తులు, అక్రమ కార్యకలాపాలపై వెంటనే సమాచారం అందించాలని సూచించారు. మొగుళ్లపల్లి ఎస్ఐ ముప్పు సురేష్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల దుర్వినియోగం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టేకుమట్ల ఎస్ఐ, చిట్యాల సర్కిల్ పోలీసు సిబ్బంది, టీజీఎస్పీ సిబ్బంది, యువకులు, విద్యార్థులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వివేకవర్ధని డిగ్రీ కళాశాలలో ఘనంగా వనమహోత్సవం

* **పచ్చని చెట్లు .....ప్రగతికి మెట్లు**
* **కళాశాల చైర్మన్ ఎంవి చౌదరి**



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం : కొత్తగూడెం పట్టణంలో గల వివేకవర్ధిని డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రాంగణము తో పాటు పరిసర ప్రాంతాలలో ఎన్.ఎస్.ఎస్, బోటనీ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో వన మహోత్సవం ఘనంగా నిర్వహించారు . ముందుగా కళాశాల చైర్మన్ ఎం.వి. చౌదరి మొక్కను నాటి ప్రారంభించారు . ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ ఎం.వి చౌదరి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఒక్క మొక్కను నాటిలాని, చెట్ల స్వచ్ఛమైన గాలి ఎంతో ప్రయోజనకరమన్నారు. ఈ కార్యక్రమంలో జ్ఞానోదయ విద్యాసంస్థల మేనేజింగ్ డైరక్టర్ ప్రణవ్ కృష్ణ , కళాశాల ప్రిన్సిపల్ .సతీష్ ,డీన్ సాయి కృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి .మల్లేష్ అకడమిక్ డైరెక్టర్ కిరణ్, బోటనీ అధ్యాపక బృందం , విద్యార్థులు పాల్గొన్నారు.

# రేగొండలో రూ.2.50 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభం



జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ, (ప్రజా స్ఫూర్తి): భూపాలపల్లి నియోజకవర్గంలోని రేగొండ మండలంలో రూ.2.50 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు శనివారం ప్రారంభించారు.రూపిరెడ్డిపల్లి, పోచంపల్లి, మడతపల్లి, పొనగండ్ల, గుడిపల్లి, పెద్దపల్లి, గడిపల్లి, రేగొండ, రావులపల్లి, జూబ్లీనగర్ గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీలను ప్రారంభించారు. దమ్మన్నపేట గ్రామంలో నిర్మించిన గ్రామపంచాయతీ ప్రహరీ గోడను కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల నుంచి సుమారు రూ.2.50 కోట్లతో ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి సీసీ రోడ్ల నిర్మాణం అత్యంత కీలకమని, మెరుగైన రహదారి సౌకర్యాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు గ్రామాల సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో ప్రహరీ గోడలు కీలక పాత్ర పోషిస్తాయని, నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు కట్టుబడి పనిచేస్తానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వ్యక్తిగత వైకల్యాన్ని విమర్శించడం అత్యంత ఖండనీయమైనది

* **తెలంగాణ ప్రైవేటు ఉద్యోగ సంఘం**



ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : వ్యక్తిగత వైకల్యాన్ని లక్ష్యంగా చేసుకుని అవమానకర వ్యాఖ్యలు చేయడం మానవత్వానికి విరుద్ధమని తెలంగాణ ప్రైవేటు ఉద్యోగ సంఘం తీవ్రంగా ఖండిస్తోంది. వైకల్యం ఉన్న వ్యక్తులను కించపరిచే వ్యాఖ్యలు చేయడం సమాజంలో వివక్షను పెంచడమే కాకుండా వారి మనోభావాలను తీవ్రంగా దెబ్బతీస్తుంది. కాబట్టి సంబంధిత వ్యక్తి వెంటనే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని తెలంగాణ ప్రైవేటు ఉద్యోగ సంఘం డిమాండ్ చేస్తోంది. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం కాకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సంఘం కోరుతోంది. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రైవేటు ఉద్యోగ సంఘం ఖమ్మం జిల్లా ఇంచార్జ్ మారేపల్లి వెంకట్ , జిల్లా అధ్యక్షుడు అప్పాని శంకర్రావు, జిల్లా కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# భూ రీ-సర్వేను అత్యంత ప్రాధాన్యతగా చేపట్టాలి

*** మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే రాష్ట్రవ్యాప్తంగా భూ రీసర్వేను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. భూ రీసర్వే, భూ భారతి అమలు, సదాబైనామా దరఖాస్తుల పరిష్కారం, ఇందిరమ్మ ఇండ్లు, 2బీహెచ్‌కే ఇళ్ల పంపిణీ, పాఠశాల విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ తదితర అంశాలపై మంత్రి, శనివారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ నుంచి రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ధరణిని రద్దు చేసి భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని, రైతుల భూములకు పూర్తి భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ భారతి అమల్లోకి వచ్చి 15 నెలలు పూర్తయినా ప్రజల అంచనాలకు పూర్తిస్థాయిలో




చేరలేకపోయామని తెలిపారు. ధరణి కాలంలో పెండింగ్‌లో ఉన్న 9.26 లక్షల సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం కోసం భూ భారతిలో అవకాశం కల్పించి, హైకోర్టు సమస్యను కూడా పరిష్కరించినప్పటికీ అధిక సంఖ్యలో దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయనే అభిప్రాయం ప్రజల్లో ఉందని, తిరస్కరణ లకు గల కారణాలను గుర్తించి పరిష్కరించా లని అధికారులను ఆదేశించారు. భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే భూ రీసర్వే తప్పనిసరి అని మేధావులు సూచించడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఇందు కోసం శిక్షణ పొందిన లైసెన్స్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని, రెగ్యులర్ సర్వేయర్లు, లైసెన్స్ సర్వేయర్లు సమన్వయంతో పని చేయాలని సూచించారు. లైసెన్స్ సర్వేయర్లకు ఉద్యోగం లేదా రెగ్యులరైజేషన్ హామీ ఇవ్వలేదని స్పష్టం చేశారు. పైలట్ ప్రాజెక్టుగా నక్షాలు లేని 413 ప్రాంతాల్లోని ఐదు గ్రామాల్లో నిర్వహించిన రీసర్వేతో 95 శాతం వరకు భూ సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. శుక్రవారం ముఖ్యమంత్రి ములుగుమాడు గ్రామ రైతులకు కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లు పంపిణీ చేశారని గుర్తు చేశారు. తొలి విడతలో ప్రతి జిల్లాలో 70 గ్రామాలను ఎంపిక చేసి రీసర్వే చేపట్టినట్లు తెలిపారు.పాలేరు నియోజకవర్గంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వచ్చిన 6,500 రెవెన్యూ సమస్యల్లో 98 శాతం సమస్యలకు భూ రీసర్వేతో శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు.తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వి.పి. గౌతమ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో గుడిసెలను గుర్తించిన వాటిలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసి ఆగస్టు నాటికి రెండు లక్షల ఇళ్ల లక్ష్యాన్ని చేరుకోవాలని, పెండింగ్‌లో ఉన్న 2బీహెచ్‌కే ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు అప్పగించాలని సూచించారు.సెర్ప్ సీఈవో దివ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల విద్యార్థుల యూనిఫాంలన్నీ స్వయం సహాయక సంఘాల మహిళా టైలర్ల ద్వారానే కుట్టిస్తున్నామని తెలిపారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామంలో భూ రీసర్వే చేపట్టామని, నాలుగు యంత్రాలను సీఎస్ఆర్ నిధుల ద్వారా కొనుగోలు చేశామని తెలిపారు. గ్రామాల మధ్య సరిహద్దు సమస్యలపై ప్రత్యేక సమన్వయంతో ముందుకు సాగుతున్నామని, భూ రీసర్వేపై ప్రజలు ఎంతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. సర్వే అనంతరం నోటీసులు జారీ చేస్తుండగా ఇప్పటివరకు కుటుంబ వివాదాలు మినహా పెద్దగా అభ్యంతరాలు రాలేదన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీఓ ఎన్. శ్రీనివాస్, తహసీల్దార్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తాళం వేసిన ఇల్లే టార్గెట్... లక్షల విలువైన బంగారం, నగదు దోపిడీ



బచ్చన్నపేట/ జనగామ, ప్రజా స్ఫూర్తి : జిల్లా లోని బచ్చన్నపేట మండల కేంద్రం లో భారీ చోరీ జరిగింది. ఇంటికి తాళం వేసి యజమానులు హైదరాబాద్ వెళ్లిన సమయంలో దొంగలు ప్రధాన ద్వారం తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి, బంగారం, వెండి వస్తువులు, నగదు అపహరించారు. బాధితుడు దొంతుల సోమలింగం తన భార్యతో కలిసి మోకాళ్ల శస్త్రచికిత్స కోసం హైదరాబాద్ వెళ్ల గా, వారి కుమారుడు ప్రణయ్ కూడా 8 వ తేదిన ఇంటికి తాళం వేసి వెళ్లారు. ఈ అవకాశాన్ని వినియోగించుకున్న దొంగలు ఇంట్లోకి చొరబడి బీరువా త లుపులు తెరిచి 9.5 తులాల బంగారు నగలు, 1.6 కిలోల వెండి వస్తువులు, రూ.50 వేల నగదు దోచుకెళ్లారు. శుక్ర వారం రాత్రి కుటుంబ సభ్యులు తిరిగి వచ్చి చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. బాధితుల ఫిర్యాదు మేరకు బచ్చన్నపే ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యా ప్తు ప్రారంభించారు. క్లూస్ టీమ్‌తో కలి సి వేలిముద్రలను సేకరిస్తూ, నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చే పట్టారు. ఈ ఘటన నేపథ్యంలో ఇళ్లకు తాళాలు వేసి వెళ్లే వారు సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని, సీసీ కె మెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అను మానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి.. ఏడుగురు అరెస్ట్



జయశంకర్ భూపాలపల్లి జిల్లా , (ప్రజా స్ఫూర్తి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూపాలపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొత్తపల్లి (ఎస్‌ఎం) గ్రామ శివారులో నిర్వహించిన దాడిలో పేకాట ఆడుతున్న ఏడుగురిని సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా సీసీఎస్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా నిందితుల వద్ద నుంచి పేకాటలో వినియోగిస్తున్న రూ.4,850 నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను, స్వాధీనం చేసుకున్న నగదుతో కలిసి తదుపరి చట్టపరమైన చర్యల కోసం భూపాలపల్లి పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ, పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పద లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలు గమనించిన వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌కు లేదా జిల్లా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

## ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

*** ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, రేగొండ, ప్రజాస్ఫూర్తి : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల సొంతింటి కలను సాకారం చేస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం జూబ్లీనగర్, నారాయణపూర్ గ్రామాల్లో నూతనంగా నిర్మించిన క్యాతం మౌనిక-విజేందర్, తనుగోజు రమ-లింగయ్య కుటుంబాల ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ద్వారా వేలాది కుటుంబాలకు సొంతింటి కల నెరవేరుతోందన్నారు. మహిళల ఆర్థిక సాధికారత, ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనకు ప్రభుత్వం పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మండల కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బి ఎల్ ఓ ఏర్పాటులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : భారతీయ జనతా పార్టీ మానుకోట జిల్లా పదాధికారుల సమావేశం శనివారం బిజెపి జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మానుకోట జిల్లా అధ్యక్షులు వల్లభు వెంకటేశ్వర్లు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఓద్దిరాజు రామచంద్రరావు పాల్గొన్నారు.జిల్లా పదాధికారులు పాల్గొన్న వారు జిల్లా ప్రధాన కార్యదర్శులు చీకటి మహేష్ గౌడ్, గడ్డం అశోక్ కుమార్, మదన్ లాల్,జిల్లా ఉపాధ్యక్షులు చిల్పూరి వెంకన్న,పొదిల్ల నరసింహారెడ్డి,ఓర్సు పద్మావతి, సయ్యద్ రేష్మ, కార్యదర్శులు సింగారం సతీశ్,దార హిందూ భారతి, నంజల అశోక్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు జి. సరోజ,బిసి మోర్చా జిల్లా అధ్యక్షులు, దాసరి మురళి,దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు బోడ వెంకన్న, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు నల్లని పాపారావు, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షులు సురేష్, కార్యాలయ ఇంచార్జ్ పల్లె సందీప్, వివిధ మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, పట్టణ, గ్రామ శాఖల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వల్లభు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న "సర్" కార్యక్రమంలో మానుకోట జిల్లా ఉన్నతాధికారులు పోలింగ్ బూతుల వారీగా పర్యటనలు చేయాల్సిన అవసరం ఉంది. బి.ఎల్.ఓ ల ఏర్పాటులో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది.

## ఎమ్మెల్యే కడియం ను మర్యాద పూర్వ కంగా కలిసిన సొసైటీ నూతన పాలక వర్గం



లింగాల ఘణపురం/జనగామ, ప్రజా స్ఫూర్తి : జిల్లా లోని లింగాల ఘణపు రం మండలం, కొత్తపల్లి లోని శ్రీ వెంకటే శ్వర హెచ్‌డబ్ల్యూసీఎస్ సొసైటీ నూత నంగా ఎన్ని కైన పాలకవర్గ సభ్యులు ని యోజకవర్గ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సం దర్భంగా సొసైటీ నూతన పాలక వర్గ స భ్యులను కడియం శ్రీహరి అభినందించి , రైతుల అభివృద్ధికి కృషి చేయాలని సూచించా రు. ఈ కార్యక్రమం లో జన గామ వ్యవ సాయ మార్కెట్ వైస్ చైర్మ న్ కొల్లూరి నర్సింహులు (శివకుమార్), సొసైటీ అధ్యక్షులు చిటుకుల వెంకటేశ్వ ర్లు, ఉపాధ్యక్షుడు బిట్ల ఆంజనేయులు, డైరెక్టర్లు కందగట్ల సుదర్శనం, బేతి చం ద్రమౌళి, గుమ్మడివెల్లి రవి కుమార్, వం గసు ధాకర్, వంగ లక్ష్మి,మ హేశ్వరం భా గ్యమ్మ, మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ దేవరాయ రాజు తదితరులు పాల్గొన్నారు.

## మాస్టర్ ప్లాన్ అమలుకు మున్సిపాలిటీ కసరత్తు..!

*** ట్రాఫిక్ రద్దీకి చెక్.. రోడ్డు విస్తరణకు సిద్ధమైన మున్సిపాలిటీ**



జనగామ, ప్రజాస్ఫూర్తి : పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు జనగామ మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్ అమలుకు కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా నెహ్రూ పార్కు నుంచి రైల్వే స్టేషన్ మీదుగా స్లాటర్ హౌస్ వరకు ఉన్న 60 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డులోని ఆక్ర మణలను తొలగించాలని మున్సిపల్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.వ్యా పారులు తమ వస్తువులను దుకాణాల పరిధిలోనే ఉంచాలని, రోడ్డుపై ఎలాంటి విక్రయాలు నిర్వహించరాదని సూచిం చారు. రోడ్డు విస్తరణ పనులు త్వరలో ప్రారంభం కానున్నందున ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని కోరా రు. లేనియెడల తెలంగాణ మున్సిపాలి టీస్ చట్టం - 2019 ప్రకారం ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండానే ఆక్రమణ లను తొలగిస్తామని, వాటి వల్ల జరిగే న ష్టానికి సంబంధిత వ్యాపారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని కమిషనర్ హె చ్చరించారు. పట్టణ అభివృద్ధి, ట్రాఫిక్ సౌలభ్యం కోసం వ్యాపారులు, ప్రజలు మున్సిపాలిటీకి పూర్తి సహకారం అం దించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

## సుడా చైర్మన్ రేస్ లో అసంపల్లి శ్రీనివాస్ (వాసు) !



ప్రజాస్ఫూర్తి కరీంనగర్ : శాతవాహన అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పదవి కాలం ముగియడంతో ఆ పీఠాన్ని దక్కించుకునేందుకు కాంగ్రెస్ నేతలు ఎవరి ప్రయత్నాలు వారు చేస్తూనే ఉన్నారు . కరీంనగర్ సుడా చైర్మన్ పదవి దక్కించుకునేందుకు శాత భావన అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మరోసారి తనకు పదవి ప్రయత్నాలు చేస్తున్నారు .వీరితోపాటు సీనియర్ కాంగ్రెస్ నేత , ఆసంపల్లి లక్ష్మీ ఫౌండేషన్ చైర్మన్ , మంత్రి శ్రీధర్ బాబు అనుచరుడు ఆసంపల్లి శ్రీనివాస్(వాసు) సుడా చైర్మన్ పదవి కోసం ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్లు సమాచారం . అలాగే ఆల్ ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి కూడా తనవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే సుడా చైర్మన్ గా పనిచేసిన కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి కి తిరిగి పదవి కట్టబెట్టద్దని కొత్తవారికి అవకాశం కల్పించాలని పలురు కాంగ్రెస్ నేతలు కోరుతున్నారు . మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఆసంపల్లి శ్రీనివాస్ శ్రీధర్ బాబు అనుచరుడే కాకుండా , ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు పొన్నం ప్రభాకర్ , అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కూడా సన్నిహితుడే . అందువల్ల కరీంనగర్ నివాసి అయిన ఆసంపల్లి శ్రీనివాస్ కు సుడా చైర్మన్ పదవి వస్తుందనే ధీమాతో అతని అనుచరులు ఉన్నారు. అసంపల్లి శ్రీనివాస్ కు పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి . గత పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపెల్లి కాంగ్రెస్ టికెట్ ఆశించినప్పటికీ వివిధ సామాజిక సమీకరణల కారణంగా శ్రీనివాస్ కు టికెట్ దక్కలేదు .సీనియర్ వాలీబాల్ అసోసియేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులుగా , సైక్లింగ్ అసోసియేషన్ పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులుగా , తెలంగాణ షార్ట్ ఫిలిం మేకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా గౌరవాధ్యక్షులుగా ఆసంపల్లి శ్రీనివాస్ కొనసాగుతున్నారు . గత పార్లమెంటు , అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల విజయం కోసం ఆసంపల్లి శ్రీనివాస్ తీవ్రంగా కృషి చేశారు . ఆసంపల్లి లక్ష్మీ ఫౌండేషన్ ద్వారా కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో అనేక సేవా కార్యక్రమాలు చేశారు. అసంపల్లి శ్రీనివాస్ కు సీఎం రేవంత్ రెడ్డి తోపాటు ఢిల్లీ పెద్దల ఆశీస్సులు ఉన్నట్లు సమాచారం. అందరి ఆశీస్సులతో తనకు శాతవాహన అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ పదవి దక్కుతుందని ధీమాతో అసంపల్లి శ్రీనివాస్ ఉన్నారు .



## జవహర్‌నగర్‌లో డంప్‌యార్డ్ వ్యతిరేక ఆందోళన

*** పలువురు నేతల ముందస్తు అరెస్టు**

ప్రజాస్ఫూర్తి, మల్కాజ్గిరి : జవహర్‌నగర్ డంప్‌యార్డ్‌ను తరలించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ప్రజలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు శనివారం చేపట్టిన నిరసన కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. "గో బ్యాక్ డంప్‌యార్డ్" నినాదాలతో ఆందోళనకు సిద్ధమైన నిరసనకారులను పోలీసులు అడ్డుకుని పలువురు నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకుని జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డంప్‌యార్డ్ కు చెత్తను తరలించే వాహనాలను అడ్డుకునేందుకు రాస్తా రోకో చేపట్టాలని ఉద్యమకారులు నిర్ణయించగా, ముందస్తు సమాచారం మేరకు పోలీసులు భారీగా మోహరించి పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా నిరసనకారులను చెదరగొట్టి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. డంప్‌యార్డ్ వల్ల కాలుష్యం, దుర్వాసన, ఆరోగ్య సమస్యలు తీవ్రంగా పెరుగుతున్నాయని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరారు. అరెస్టులతో ఉద్యమాలను అణచివేయలేరని, డంప్‌యార్డ్‌ను తక్షణమే తరలించాలని వారు డిమాండ్ చేశారు. జవహర్‌నగర్ ప్రాంతంలో భారీ పోలీసు బందోబస్తు కొనసాగుతుండగా పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అరెస్టయిన వారిలో కాంగ్రెస్ నాయకుడు కోటేష్‌గౌడ్, మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, బీఆర్ఎస్ నాయకురాలు లలిత యాదవ్, బీజేపీ ఓబీసీ నాయకుడు లక్ష్మీనారాయణ, నవోదయ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు, ఓబీసీ ఛానల్ రిపోర్టర్ సందీప్ తదితరులు ఉన్నారు.

## చౌటుప్పల్ చేనేత సహకార సంఘం ఎన్నికల్లో శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి ప్యానల్ క్లీన్ స్వీప్

**: నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం**

*** నూతన అధ్యక్షునిగా బడుగు మోహన్ బాబు**






చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ చేనేత సహకార సంఘం ఎన్నికల్లో శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి ప్యానల్ క్లీన్ స్వీప్ చేసింది. బరిలో నిలిచిన 9మంది సభ్యులకు గానూ 9మంది విజయకేతనం ఎగరవేశారు. చౌటుప్పల్ చేనేత సహకార సంఘం నూతన కార్యవర్గం శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. నూతన అధ్యక్షునిగా బడుగు మోహన్ బాబు, ఉపాధ్యక్షునిగా గోశిక శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా కాటబత్తిని భీమయ్య, కోశాధికారిగా బడుగు సావిత్రి, సభ్యులుగా గోశిక నర్సింహ్మ, గోశిక లక్ష్మీపతి, దోర్నాల లక్ష్మీనారాయణ, పాపని రామకృష్ణ, బత్తుల మానసలు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సంఘం అధ్యక్షుడు బడుగు మోహన్ బాబు మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి కృషి చేస్తూ గతంలో తన తండ్రి చేసినటువంటి అభివృద్ధి కార్యక్రమాలను ఏ విధంగా పారిశ్రామికులకు అందించారో, అదేవిధంగా ఆయన బాటలోనే నడుస్తూ సంఘ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పారిశ్రామికులకు అందించాల్సిన ప్రభుత్వ పథకాలు, సంఘం ద్వారా అందించాల్సిన చేనేత వృత్తులపై ప్రత్యేకంగా దృష్టి సాదిస్తూ ముందుకు వెళ్తానని తెలిపారు. అనంతరం నూతన పాలకవర్గాన్ని చౌటుప్పల్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్ పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మునుగోడు నియోజకవర్గ ఇంచార్జ్ బడుగు లక్ష్మయ్య, చౌటుప్పల మాజీ ఎంపీపీ చిక్క నరసింహ, చౌటుప్పల్ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు కందగట్ల బిక్షపతి, గోశిక చక్రపాణి, చౌటుప్పల్ మాజీ ఎంపీటీసీ పెద్ది కృష్ణ, శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి దేవస్థానం ధర్మకర్త బడుగు శ్రీరాములు, శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి దేవస్థానం అధ్యక్షుడు బడుగు జయప్రకాష్, శ్రీ భావన ఋషి కళానికేతన్ అధ్యక్షుడు బడుగు బాలరాజు, ప్రముఖ చేనేత కళాకారులు బత్తుల చంద్రయ్య, అభిమానులు, చేనేత పారిశ్రామికులు తదితరులు పాల్గొన్నారు.

# నితిన్‌కు జోడీగా..



తమ్ముడు డిజాస్టర్ తర్వాత నితిన్ వరుసగా మూడు సినిమాలకు ఓకే చెప్పాడు. దండోరా ఫేమ్ మురళీ కాంత్ డైరెక్షన్‌లో ఓ సినిమా చేయబోతున్నాడు. ఈ మూవీకి హీరో నాని ప్రొడ్యూసర్‌గా వ్యవహరించబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. దండోరా తరహా-లోనే మెసేజ్ ఓరియెంటెడ్ లవ్‌స్టోరీగా ఈ సినిమా తెరకెక్కబోతు-న్నట్లు సమాచారం. తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌తో సాగుతుందని అంటు న్నారు. ఇందులో హీరోయిన్ కూడా ఫైనల్ అయినట్లు టాక్. నితిన్‌కు జోడీగా కాంతార బ్యూటీ రుక్మిణి వసంత్ నటిం చబోతుంది. ఇందులో గ్లామర్ హంగులకు దూరంగా కొత్త కోణంలో రుక్మిణి పాత్ర సాగుతుందని సమాచారం. త్వరలోనే అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రానుందట. ఆగస్ట్ నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలయ్యే అవకాశం ఉందని అంటున్నారు.

# చివరి సినిమా తెలుగులోనే చేస్తా

లెనిన్ సక్సెస్ మీట్‌లో భాగ్యశ్రీ బోర్సే ఎమోషనల్ అయ్యింది. ఆమె హీరోయిన్‌గా నటించిన లెనిన్ మూవీ శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. శనివారం జరిగిన సక్సెస్ మీట్‌లో మాట్లాడుతూ తెలుగు ప్రేక్షకుల సపోర్ట్ వల్లే ఈ స్థాయికి చేరుకున్నాను. చివరి సినిమా కూడా తెలుగులోనే చేస్తా అని చెప్పింది. ఏడుస్తూనే తన స్పీచ్‌ను కొనసాగించిన ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.





# టీజర్‌లో సాయిపల్లవి కనిపించదట

ప్రస్తుతం పాన్ ఇండియన్ వైడ్‌గా భారీ బజ్ నెలకొన్న సినిమాల్లో రామాయణ ఒకటి. దీని టీజర్ ను జూలై 24న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. టీజర్ రిలీజ్‌కు సంబంధించి ముంబైలో ఓ భారీ ఈవెంట్‌ను ప్లాన్ చేస్తున్నారట. కాగా ఈ ట్రైలర్‌పై ఓ రూమర్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. సాయిపల్లవి క్యారెక్టర్‌ను చూపించకుండానే ట్రైలర్‌ను కట్ చేయబోతున్నారని అంటున్నారు. కేవలం రణభీర్‌కపూర్, యశ్ మాత్రమే కనిపించనున్నట్లు సమాచారం. ప్రమోషనల్ స్ట్రాటజీ కోసమే సాయిపల్లవి రోల్‌ను మేకర్స్ దాస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. ఆగస్ట్‌లో ఓ స్పెషల్ వీడియో ద్వారా సాయిపల్లవి లుక్‌ను రిలీజ్ చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట.

సినిమా

## మైనర్‌కు వేధింపులు

- **ప్రముఖ నటుడిపై పోక్సో కేసు**

మైనర్ బాలికను వేధించిన కేసులో ప్రముఖ బాలీవుడ్ టీవీ యాక్టర్ రోహిత్ చండేల్‌పై పోక్సో కేసు నమోదు అయ్యింది. శనివారం ముంబై పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. గత కొద్ది రోజులుగా వేర్వేరు నంబర్లతో ఫోన్ చేస్తూ రోహిత్ చండేల్ తనను వేధింపులకు గురి చేసినట్లు ఓ మైనర్ బాలిక శనివారం ముంబై పోలీసులను ఆశ్రయించింది. జూలై 5వ తేదీన ఇంటికి వెళుతోన్న తనను రోహిత్ చండేల్ అడ్డగించాడని, అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా భౌతికంగా దాడులకు పాల్పడినట్లు తన ఫిర్యాదులో పేర్కొన్నది. మైనర్ స్వీకరించిన పోలీసులు రోహిత్ చండేల్‌ను అరెస్ట్ చేశారు. పోక్సోతో పాటు మరో రెండు సెక్షన్ల కింద అతడిపై కేసును నమోదు చేశారు. రిమాండ్‌కు తరలించారు. టీవీ యాక్టర్‌గా ఫేమస్ అయిన రోహిత్ చండేల్ కొన్ని సినిమాలు చేశాడు. ది అమెరికన్ గాంధీ, బ్లైండ్ గేమ్, రైడర్ సినిమాల్లో కీలక పాత్రలు పోషించాడు.



# త్రివేండం రాయల్స్ ఓనర్‌గా కీర్తి

ఓ వైపు సినిమాలు చేస్తూనే సొంత బిజినెస్‌లలో రాణిస్తున్నారు నేటితరం హీరోయిన్లు. ఇదే ఆలోచనతో మహానటి కీర్తి సురేష్ తాజాగా క్రికెట్ టీమ్‌కు ఓనర్‌గా మారింది. కేరళ క్రికెట్ లీగ్‌లో త్రివేండం రాయల్స్ టీమ్‌ను దిగ్గజ దర్శకుడు ప్రియదర్శన్, హీరోయిన్ కళ్యాణి ప్రియదర్శన్‌తో కలిసి రెండేళ్ల క్రితం కొనుగోలు చేసింది. ఇటీవలే ఈ టీమ్ ఓనర్‌షిప్ హక్కులను పూర్తిగా కీర్తి సొంతం చేసుకుందని అంటు-న్నారు. శుక్రవారం కేరళ క్రికెట్ లీగ్‌కు సంబంధిం చిన ఆటగాళ్ల వేలంలో త్రివేండం రాయల్స్ ఓనర్ హోదాలో ఆమె పాల్గొన్నది. ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోన్నాయి. కాగా పెళ్లి తర్వాత సి-నిమాలకు స్మాల్ గ్యాప్ ఇచ్చిన కీర్తి ప్రస్తుతం తెలుగులో విజయ్ దేవరకొండతో రౌడీ జనార్దనతో పాటు వెంకటేష్, కళ్యాణ్ రామ్ మల్టీస్టారర్ మూవీలో హీరోయిన్‌గా నటిస్తోంది.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.